# వార్త

ఆదివారం

6 నవంబరు, 2022



# బ్రిటన్‌కు 'రిషి' మంత్రం





# రామ్ సినిమాలో ఊర్వశి రౌటేలా స్పెషల్ సాంగ్?

ఇటీవల నటసింహం నందమూర్తి బాలకృష్ణ హీరోగా ‘అఖండ’ లాంటి భారీ బ్లాక్ బస్టర్ సక్సెస్‌ఫుల్ మూవీ తెరకెక్కించిన మాస్ యాక్షన్ సినిమాల దర్శకుడు బోయపాటి శ్రీను, ప్రస్తుతం యువ హీరో రామ్‌తో తెరకెక్కిస్తున్న లేటెస్ట్ మూవీ షూటింగ్ జరుగుతోంది. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా థమన్ సంగీతం అందిస్తున్నారు. మొదటి నుండీ అందరిలో మంచి ఆసక్తిని కలిగించిన ఈ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో రూపొందుతుండగా ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించి ఒక క్రేజ్ న్యూస్ వినిపిస్తోంది. బాలీవుడ్ యువ బ్యూటీ ఊర్వశి రౌటేలా స్పెషల్ సాంగ్‌లో నటించనున్నట్లు సమాచారం. ఈ పాటకు థమన్ సూపర్ ట్యూన్ అందించినట్లు టాక్.

**తారాతీరం**

# విభిన్నమైన ప్రేమ కథ ‘18 పేజెస్’

నిఖిల్ నుంచి ఇటీవల వచ్చిన ‘కార్తికేయ 2’ భారీ విజయం సాధించింది. హిందీలోనూ ఈ సినిమా రికార్డుస్థాయి వసూళ్లను రాబట్టింది. ఈ సినిమాతో పాటు నిఖిల్ మొదలెట్టిన ‘18 పేజెస్’ కూడా చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది. డిసెంబరులో ఈ సినిమా విడుదల కానుంది. ఇది విభిన్నమైన ప్రేమ కథ. ఇందులో నిఖిల్ జోడీగా అనుపమ పరమేశ్వరన్ నటించింది. గీతా ఆర్ట్స్ 2-సుకుమార్ రైటింగ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘కుమారి 21 ఎఫ్ దర్శకుడు పల్నాటి సూర్య ప్రతాప్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నాడు. గోపీసుందర్ ఈ సినిమాకి సంగీతం అందించాడు. ఆయన బాణీలు ఈ సినిమాకి హైలైట్‌గా నిలవనున్నాయని అంటున్నారు. ‘కార్తికేయ 2’ తరువాత నిఖిల్ అనుపమ కలిసి నటించిన సినిమా కావడంతో అందరిలో ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాతో ఈ జంట మరో హిట్ అందుకుంటుందేమో చూడాలి మరి.



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
6 నవంబరు, 2022

## మంచి ముత్యాలు

భూమికి సూర్యుడు ఎంత అవసరమో,
జీవితానికి ప్రేమ అంత అవసరం.

- టాల్‌స్టాయ్

## విషయ విశేషం

భూగర్భంలో పొడవైన నది... 4
'సంఘీ'భావం....5
సామాన్యులకు అందుబాటులో లేని వైద్యం
స్వేచ్ఛా ప్రతిమ స్టాట్యూ ఆఫ్ లిబర్టీ...6
కవర్ స్టోరీ..8
బ్రిటన్‌కు 'రిషి' మంత్రం
శిశు సంరక్షణ మన బాధ్యత...14
మొక్కలకు స్మార్ట్ కుండీ..18
కథ.. 20
ఇల్లాలి కోరిక
సాహిత్యం.. 23
కవి సమ్రాట్ విశ్వనాథవారి..
గల్లివర్ ట్రావెల్స్..26
ఈవారం కవిత్వం..29
ఆకుపచ్చ ఆకాశం...
చిత్రభారతి.. .30
దాసరి నవరస భరితం 'బంగారు కుటుంబం' ... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..



# తాజా వార్తలు

## ఆకలి కోపం పెంచుతుందా?

"నాకు కోపం వస్తోంది" అని ఎవరైనా అంటే వాళ్లను బాగా గమనించండి. ఆ తరువాత "ఆకలిగా ఉందా?" అని అడగండి. మీకు వాళ్ల కోపానికి కారణం కచ్చితంగా తెలుస్తుంది.. అంటున్నారు. లండన్‌లోని ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ, ఆస్ట్రియాలోని కార్ల్ ల్యాండ్‌స్టీనర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు చెందిన పరిశోధకులు. ఆకలితో వచ్చే ఈ కోపాన్ని హ్యాంగ్రీ అని పలుస్తున్నారు. ఆకలి వేయడం వల్ల కపం, చిరాకు బాగా పెరిగిపోతుందని, వంద మందిలో సుమారు నలభై మందికి కోపం రావడానికి కారణం ఆకలేననీ వాళ్ల అధ్యయనంలో తేలిందట. భోజనానికి-భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే రక్తంలో చక్కెర నిల్వలు తగ్గిపోతాయి. దాంతో ఒత్తిడిని పెంచే కార్టిసాల్, కోపాన్ని కలిగించే అడ్రినలిన్ హార్మోన్ల శాతం పెరుగుతుంది. కనుకనే ఆకలి వేసినప్పుడు కోపం వస్తుందంటున్నారు. ఈ విధంగా వచ్చిన హ్యాంగ్రీ భావోద్వేగాలని, ప్రవర్తనని ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఆ సమయంలో మెదడు చురుకుదనం తగ్గడంతో పాటు స్వీయ నియంత్రణ కూడా ఉండదట. కనుక అలాంటి సమయంలో పీచు ఎక్కువగా ఉండే పోషకాహారం తీసుకుంటే ఆకలి, తద్వారా కోపమూ తగ్గుతాయంటున్నారు సదరు పరిశోధకులు.

### నీటి చెంతకు వెళుతున్నారా?

నదీ ప్రవాహాల్నీ, సాగరతీరాల్నీ, సెలయేళ్లనీ తరచుగా సందర్శించే వాళ్లు మానసిక సమస్యలకు దూరంగా ఉంటారట. ముఖ్యంగా నీళ్లకు సమీపంలో నివసించేవాళ్లలో ఒకలాంటి ప్రశాంతత కనిపిస్తుంది. ఎందుకంటే చుట్టుపక్కల వాతావరణం పచ్చగానో, నీలంగానో ఉంటే ఆ ప్రదేశంలో జీవించే వాళ్లలో మానసిక అలజడి, ఒత్తిడి తక్కువగా ఉంటున్నట్లు గతంలోనే గుర్తించారు లండన్ కింగ్స్ కాలేజ్ పరిశోధకులు.

అయితే నీలాకాశాన్ని చూస్తూ నీళ్లకు సమీపంలో జీవిస్తున్న వాళ్లలో మానసిక సమస్యలు మరింత తక్కువగా ఉంటున్నాయట. ఇందుకోసం వీళ్లు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నవాళ్లని ఎంపిక చేసి కొంత కాలం నీళ్లకు సమీపంలో నివసించేలా చేసినప్పుడు వాళ్లలో మెరుగైన ఫలితాలు వచ్చాయట. అంతేకాదు.. వారానికి కనీసం రెండు గంటల పాటు నీళ్ల దగ్గర గడిపినా మంచిదనీ, కనుక తరచూ తీర ప్రాంతాల్నీ, జలపాతాల్నీ చూసిరావడం ఎంతో మేలని సూచిస్తున్నారు



# భూగర్భంలో పొడవైన నది



ప్రపంచంలోనే అత్యంత పొడవైన భూగర్భనది ఫిలిప్పీన్స్‌లో ఉంది. దీని పేరు ఫ్యూర్టో ప్రిన్సెస్సా. ఇది సెయింట్‌పాల్ పర్వత శ్రేణి కింద సుమారు యాభై కిలోమీటర్ల మేర ప్రవహించి దక్షిణ చైనా సమద్రంలో కలుస్తుంది. ఈ భూగర్భనదిలో పడవ ప్రయాణం చేసే అవకాశమూ ఉంది.

ప్రపంచంలో అత్యధికంగా దీవులున్న దేశం ఇండోనేషియా. కానీ ఎన్ని దీవులున్నాయో అక్కడి ప్రభుత్వం కూడా లెక్క తేల్చలేకపోతోంది.



# దీవుల దేశం ఇండోనేషియా

# 'సంఘీ' భావం



## సామాన్యులకు అందుబాటులో లేని వైద్యం

సాధారణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో లేకుండా పోయింది. మూడు, నాలుగు దశాబ్దాల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం చిన్నచిన్న వ్యాధులకు కూడా లక్షల రూపాయలు వెచ్చించే పరిస్థితి నెలకొంది. వైద్య రంగంపై ప్రైవేటు పట్టు పెరిగిన తరువాత నాణ్యమైన, అధునాతనమైన వైద్యం అందుబాటులోకి వచ్చినప్పటికీ నిరుపేదలకు అందనంత ఎత్తులో ఉంది. గతంలో కేవలం ప్రభుత్వ వైద్యశాలల్లో మాత్రమే సరైన చికిత్స లభించేది. దీనితో నిరుపేదలతో పాటు ఎగువ మధ్యతరగతి కుటుంబాలు కూడా ప్రభుత్వాసుపత్రులకే వెళ్లే వారు. ప్రభుత్వం ఆధీనంలో వైద్య చికిత్సలు ఉన్నప్పుడు కేవలం రోగికి ఏమేరకు చికిత్స అవసరమో దానిని మాత్రమే అందించే వారు. ప్రస్తుతం దానికి భిన్నమైన చికిత్సను ప్రైవేటు ఆసుపత్రుల్లో అందిస్తున్నారు. ఒక వ్యక్తి తిరుపతి నుంచి బస్సులో ప్రయాణం చేసి హైదరాబాద్‌కు వచ్చాడు. వచ్చిన తరువాత తీవ్రమైన అలసటకు గురయ్యాడు. ఈ సమయంలో ఆయన కొద్దిసేపు కోమా వంటి దశకు వెళ్లాడు. గంట తరువాత తేరుకున్నప్పటికీ ఇంట్లో వారి వత్తిడితో ఆసుపత్రికి వెళ్లాడు. ముందుగా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు అతనిని పరీక్షించి వ్యాధి ఏమీ లేదని, కేవలం 50 సంవత్సరాలు దాటిన వయస్సు, ఉద్యోగంలో వత్తిడి కారణంగా ఇలాంటి వచ్చిందని చెప్పి రెండు రకాల టాబ్లెట్లు రాసి, పౌష్టిక ఆహారాన్ని సేవించాలని సలహా ఇచ్చి పంపించారు. అయితే తన శరీరంలో ఏదో జరుగుతుందన్న అనుమానంతో ఉన్న అతను మరుసటి రోజు హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లాడు. ముందుగా సాధారణ వైద్యుడు పరిశీలించి అతనిని న్యూరోసర్జన్‌ను సంప్రదించాలని సలహా ఇచ్చాడు. అదే ఆసుపత్రిలో ఉన్న న్యూరోసర్జన్ వెయ్యి రూపా యల కన్సల్టెంట్ ఫీజు తీసుకుని వైద్య చికిత్స ప్రారంభించాడు. ముందుగా నాలుగు రకాల టెస్ట్‌లు చేసుకుని అర్జంట్‌గా రావా లని సూచించాడు. డాక్టర్ల శ్రద్ధ హడావిడి చూసి తాను ప్రైవేటు ఆసుపత్రికి వచ్చింది ఎంతో మంచిదైందని అతను మూడు వేల రూపాయలు ఖర్చు పెట్టి అన్ని పరీక్షలు చేయించుకుని రిజల్ట్‌తో వైద్యుని కలిసాడు. అన్నీ పరిశీలించిన అతను లోపం ఏదీ లేదని ఎందుకైనా మంచిందని మరో రెండు ఖరీదైన టెస్ట్‌లు రాశాడు. మళ్లీ టెస్ట్‌లు చేయించుకుని డాక్టర్‌ను కలిశాడు. అన్నీ నెగిటివ్ రిపోర్ట్ రావడంతో డాక్టర్ అతనికి ముందు జాగ్రత్త కోసమని చెప్పి పది రకాల టాబ్లెట్లు, రెండు టానిక్‌లు రాసి ఒకరోజు పూర్తిగా రెస్ట్ తీసుకోవాలని చెప్పాడు. ఇప్పుడు రోగి ఇంటికి వెళ్లి ఒకసారి నాలుగు రోజులుగా తన పరిస్థితిని సమీ క్షించుకున్నాడు. ఒక్కరూపాయి కూడా ఖర్చు కాకుండా ప్రభుత్వ వైద్యుడు ఇచ్చిన సలహానే పది వేల రూపాయల ఖర్చు తరువాత కార్పొరేట్ వైద్యుడు అదే సూచనలు చేశాడు. ఇలాంటి పరిస్థితి ఈయనకే కాదు ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో కొన్ని ఆసుపత్రులు మానవత్వం మరిచి వ్యవహరించారు. కేవలం ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులను సైతం భయాందోళనలకు గురిచేసి ఐసియులో బెడ్ ఇచ్చి రోజుకు 30 వేలు వసూలు చేసి నాలుగైదు రోజుల తరువాత మళ్లీ సాధారణ వార్డుకు మార్చి లక్షల రూపాయలు వసూలు చేశారు. కొన్ని సందర్భాల్లో రోగి చనిపోయినా విషయం దాచి బంధువుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే అక్కడ రోగులకు సరైన వైద్యం అందడం లేదు. రోగితో మాట్లాడటానికి కూడా కొందరు ప్రభుత్వ వైద్యులు ఆసక్తి చూపించరు. ఇక నర్సులు. వార్డ్‌బాయ్‌లు రోగులను నీచాతినీ చంగా చూస్తారు. ఇన్‌పేషెంట్‌గా చేరితే ఇక డబ్బు ముట్టచెబి తేనే కాని వారిని మనుషులుగా చూడరు. ఇక ఆసుపత్రులో మందులు అందుబాటులో ఉండవు. ఒకటి రెండు మందులు మాత్రమే ఉంటాయి. ఒకవేళ ఉన్నా అవి కాకుండా వేరే మందులు రాసి ఫలానా మెడికల్ షాపులో తీసుకోవాలని సలహా ఇస్తారు. అక్కడ నుంచి కమీషన్లు డాక్టర్లకు అందుతుండటంతో ఈ వైఖరి కొనసాగుతోంది. ఇక ప్రైవేటు ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలకు చెందిన కార్డులను తీసుకువెళితే కొన్ని వ్యాధులకే ఈ కార్డు వర్తిస్తుందని, డబ్బు కట్టి వైద్యం చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రైవేటు ఇన్సూరెన్స్‌లు అందుబాటులో ఉన్న అనేక నిబంధనలు ఉంటున్నాయి. ఏ వ్యాధికి బీమా వర్తిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కార్డు తీసుకునే సమయంలో అన్ని వ్యాధులకు వర్తిస్తుందని సంస్థలు హామీ ఇస్తారు. అయితే అమలులో మాత్రం అనేక ఇబ్బందులు ఉంటున్నాయి. నిరుపేద కుటుంబాలు బీమా తీసుకునే స్థాయిలో ఉండరు కాబట్టి ఇళ్లు, పొలాలు అమ్ముకుని వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మందులు కూడా ఉచితంగా ఇస్తున్నట్లు ప్రభుత్వాలు ప్రకటించినా ఆచరణలో మాత్రం ఆశించిన ఫలితం ఉండటం లేదు. పరీక్షలు నిర్వహించే యంత్రాలు పనిచేయడం లేదు. ఆసుపత్రి వర్గాలు ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినా వాటిని బాగుచేయడం లేదు. దీనితో రోగనిర్ధారణ సక్రమంగా జరగడం లేదు. డాక్టర్ విద్య అభ్యసించి బయటకు వచ్చిన విద్యార్థులు విదేశాలకు వెళ్లడానికి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లడానికి సిద్ధపడినా నగరాలు, పట్టణాల్లో ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనితో గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రులు వైద్యులు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం నిరుపేదలకు వైద్య సేవలందించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తేనే వైద్యం అందరికీ అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫీజులపై నియంత్రణ ఉండాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# స్వేచ్ఛా ప్రతిమ స్టాట్యూ ఆఫ్ లిబర్టీ

షేక్ అబ్దుల్ హాకీం జాని

ప్రపంచంలోని అనేక దేశాలలో ఎన్నో నిర్మాణాలను మనం చూస్తూంటాం. అయితే కొన్ని దేశాల పేర్లు చెప్పగానే ఒకే నిర్మాణం కళ్ల ఎదుట సాక్షాత్కరిస్తుంది. ఈజిప్ట్ పేరు చెప్పగానే పిరమిడ్‌లు, భారతదేశం పేరు చెప్పగానే తాజ్‌మహల్, ప్యారిస్ పేరు చెప్పగానే ఈఫిల్ టవర్, చైనా పేరు చెప్పగానే చైనా గోడ.. ఇవన్నీ ప్రజల హృదయాలకు హత్తుకుని పోయాయి. అటువంటి వాటిలో ఒకటి అమెరికాలోని న్యూయార్క్ నగరం హార్బర్‌కు అభిముఖంగా సముద్ర జలాలలోని ఒక చిన్న దీవిపై ఏర్పాటు చేసిందే స్టాట్యూ ఆఫ్ లిబర్టీ. న్యూయార్క్ నగరానికి మైలురాయిగా భాసిల్లుతున్న స్మారక చిహ్నం స్టాట్యూ ఆఫ్ లిబర్టీ. న్యూయార్క్‌తో పాటు అమెరికాకే ప్రత్యేక ఆకర్షణగా ప్రపంచ పర్యాటకుల ప్రశంసలందుకుంటోంది. ఇది ఒక స్త్రీ మూర్తి విగ్రహం. కాగడాను చేతితో ఎత్తి చూపుతూ ఉన్న ఈ విగ్రహం ఎత్తు అంచువరకు 305 అడుగులు ఉంటుంది. మొదట్లో ఈ విగ్రహాన్ని లైట్ హౌస్‌గా ఉపయోగించారు. అప్పట్లో విగ్రహం చేతిలో ఉన్న కాగడా వెలుగుతూ ఉండేది. ఆ కారణంగా నౌకలకు దిశ చూపే లైట్ హౌస్‌గా దీన్ని ఉపయోగించారు. అధికారికంగా దీన్ని ఎన్‌లైటింగ్ ది వరల్డ్, లేడీ లిబర్టీ అని పిలుస్తారు. ఇది ఒక స్మారక చిహ్నం. యునైటెడ్ స్టేట్‌కి ఒక చిహ్నంగా ఈ స్మారక కట్టడం నిలుస్తుంది. న్యూయార్క్ నగరం హార్బర్ సమీపంలో ఉన్న వెల్లిస్ సిటీలో ఉంది. ప్రస్తుతం ఈ ద్వీపాన్ని 'లిబర్టీ ఐలెండ్'గా పిలుస్తున్నారు. ఇక్కడ నక్షత్రాకార పీఠంపై ఈ విగ్రహాన్ని నిలబెట్టారు. వాస్తవానికి, ఈ విగ్రహాన్ని స్నేహానికి గుర్తుగా ఫ్రాన్స్‌దేశం యునైటెడ్ స్టేట్స్‌కు బహుమతిగా ఇచ్చింది. మొదటిసారిగా అమెరికా దేశంలో అడుగుపెట్టిన లక్షలాది మంది పర్యాటకులకు న్యూయార్క్‌లోని ఈ ఐకానిక్ శిల్పాన్ని సందర్శించమని ఎవరూ గుర్తు చేయాల్సిన అవసరం లేదు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీని 1984లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది.

## స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఎందుకు నిర్మించారు?

1775 నుండి 1783 మధ్య కాలంలో అమెరికాలో ఉన్న కొన్ని ప్రదేశాలను బ్రిటిష్‌వారు పరిపాలించేవారు. బ్రిటిష్ వారిని అమెరికా నుండి తరిమేయడానికి అమెరికన్‌లు స్వాతంత్ర్య పోరాటం, యుద్ధాలు చేసారు. ఇదిలా ఉంటే ఈ విప్లవ యుద్ధంలో విజయం సాధించాలంటే అమెరికాకు ఫ్రెంచివారి సహాయ సహకారాలు అత్యవసరమయ్యాయి. దీంతో స్నేహ హస్తాన్ని చాచిన అమెరికాకు ఫ్రెంచి ప్రభుత్వం అనుకూలంగా సైన్యాన్ని, యుద్ధ ఓడలను, ఆయుధాలను, డబ్బును సమకూర్చింది. ఈ యుద్ధంలో అమెరికా విజయం సాధించింది. ప్రపంచంలో వలసవాదాన్ని తరిమికొట్టి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న పోరాటం అమెరికన్ విప్లవం. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ప్రపంచమంతటా నెలకొల్పాలని భావించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులను మట్టికరిపించి జయకేతనం ఎగురవేసింది అమెరికన్ విప్లవం. అమెరికా స్వేచ్ఛను పొందిన నేపథ్యంలో అప్పటి ఫ్రాన్స్, అమెరికా దేశాల స్నేహానికి గుర్తుగా ఫ్రాన్స్ దేశం ఈ స్వేచ్ఛా ప్రతిమను బహుమానంగా ఇచ్చారు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహాన్ని విప్లవ సమయంలో ఇరు దేశాల నడుమగల స్నేహ సంబంధాలకు గుర్తుగా ఫ్రెంచి ప్రభుత్వం 28 అక్టోబర్ 1886న బహూకరించింది. అమెరికన్ విప్లవం విజయానికి గుర్తుగా 1886లో వేడుకలను జరుపుకునే సందర్భంలో అమెరికన్ ప్రజానీకానికి ఫ్రెంచ్ ప్రభుత్వం 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ' విగ్రహాన్ని కానుకగా సమర్పించింది. అమెరికా ప్రత్యేక గుర్తింపుగా మిగిలిన ఈ ప్రఖ్యాత శిల్పం ఓడలో న్యూయార్క్‌కు చేరుకున్న రోజును చరిత్రలో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

## అమెరికా స్మారక చిహ్నం

అమెరికా స్మారక చిహ్నంగా భాసిల్లుతున్న ఈ స్వేచ్ఛా ప్రతిమ తన కుడి చేతిలో ఒక కాగడాను, ఎడమ చేతిలో ఒక పుస్తకాన్ని పట్టుకొని ఉంటుంది. ఆ పుస్తకంపై రోమన్ భాషలో 4 జులై, 1776 అని లిఖించి ఉంటుంది. ఇది అమెరికా స్వాతంత్ర్యాన్ని పొందిన రోజు. ఈ స్వేచ్ఛా విగ్రహం అధికారిక నామం 'లిబర్టీ ఎన్‌లైటింగ్ ది వరల్డ్'. ఈ విగ్రహంలో కాగడా పట్టుకున్న చేతి పొడవు 42 అడుగులు కాగా విగ్రహం మొత్తం పొడవు 151 అడుగులు ఉంటుంది. ఇంతకీ విగ్రహం ఎడమ చేతి పిడికిలో ఏముంటుందో మీకు తెలుసా? మూసి



ఉంచిన ఆ గుప్పిట్లో 1776 జులై 4 అనే అంకెలు ఉన్న ఒక ఫలకం ఉంటుంది. మనకు 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం వచ్చిన తేదీ మాదిరిగానే అమెరికాకు కూడా 4 జులై 1776 సంవత్సరంలో వచ్చింది. అందువల్ల ఆ ఫలకంలో స్వాతంత్ర్యానికి గుర్తుగా పై అక్షరాలు వచ్చేలా రూపొందించారు. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని 'బెడ్లోస్ ద్వీపం' అని పిలిచేవారు. యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ ఆమోదించిన చట్టం ద్వారా 1956లో లిబర్టీ ద్వీపంగా పేరు మార్చడం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో కుడి చేతిలోని కాగడా భాగం కొంత మేరకు దెబ్బతిన్నది. తరువాత దీన్ని పునర్నిర్మించారు. కాలక్రమేణా గాలిలో ఉన్న ఆక్సిజన్‌తో జరిగిన చర్య కారణంగా రాగి విగ్రహం నీలం రంగులోకి మారింది. ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించి దశాబ్దాలు గడిచిన సందర్భంగా సముద్రపు ఉప్పుగాలికి, తేమకు, ఉరుములు, పిడుగులు వంటి ప్రకృతి వైపరీత్యాలకు ఈ విగ్రహం మాసిపోవడం వల్ల దానిని యథాస్థితికి తీసుకురావడానికి దాదాపు రెండు మిలియన్ల డాలర్లు ఖర్చు చేసారు. ఈ ధనాన్ని అమెరికా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాల రూపంలో ఇవ్వడం విశేషం.



**స్వేచ్ఛా ప్రతిమ రూపకర్త**

స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహం రూపొందించడానికి పథకాన్ని రచించిన వ్యక్తి ఫ్రెంచి చరిత్రకారుడు 'ఎడ్వర్డ్ డి లాబోలాయ్. ఈ స్వేచ్ఛా ప్రతిమకు అవసరమైన ధన సహాయం ఫ్రాన్స్ దేశ ప్రజలు విరాళాల రూపంలో అందించారు. ప్రఖ్యాత ఇటాలియన్ ఫ్రెంచ్ శిల్పి ఫ్రెడరిక్ అగస్టే బర్తోల్డి ఈ విగ్రహాన్ని రూపొందించారు. లోహపు బాహ్య భాగాన్ని శిల్పి గుస్టావ్ ఈఫిల్ చెక్కారు. ఫ్రాన్సు నుండి న్యూయార్క్‌కు రవాణా చేసినప్పుడు విగ్రహం 350 భాగాలుగా చేసి ఓడలో చేర్చారు. వాటిని న్యూయార్క్‌లో విగ్రహ రూపం అమర్చడానికి నాలుగు నెలలు పట్టింది. ఈ కార్యక్రమం 28 అక్టోబరు 1886 నాటికి పూర్తయింది. 28 అక్టోబరు 1886న రాగి పూత పూసిన స్మారక చిహ్నం ఫ్రాన్స్ ప్రజల నుండి యునైటెడ్ స్టేట్స్‌కు ఒక బహుమతిగా సమర్పించబడింది. సందర్శకులు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ కిరీటం వరకు 356 మెట్ల ద్వారా పర్యాటకులు చేరతారు. కిరీటంలో 25 కిటికీలు ఉన్నాయి. పర్యాటకులు ఈ కిటికీల ద్వారా న్యూయార్క్ ప్రకృతిని వీక్షించవచ్చు. విగ్రహం కిరీటంపై ఉన్న ఏడు కిరణాలు ఏడు సముద్రాలతో పాటు ఏడు ఖండాలను సూచిస్తాయి. పాశ్చాత్య భౌగోళిక సంప్రదాయంలో సరిగ్గా ఏడు ఖండాలు ఉన్నాయి. అవి ఆఫ్రికా, యూరప్, ఆసియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, అంటార్కిటికా, ఆస్ట్రేలియా.

**స్టాట్యూ ఆఫ్ లిబర్టీ కొలతలు**

స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఎత్తును పలు రకాలుగా చెబుతారు. పీఠంపై నుండి టార్చ్ వరకు ఎత్తు 46.05 మీటర్లు, భూమి నుండి టార్చ్ పై భాగం వరకు ఎత్తు 92.99 మీటర్లు, విగ్రహం ఎత్తు 33.86 మీటర్లు, చేతి పొడవు అయిదు మీటర్లు, చూపుడు వేలు పొడవు 2.44 మీటర్లు, కిరీటం నుండి గడ్డం వరకు తల 5.26 మీటర్లు, ముఖం వెడల్పు 3.05 మీటర్లు, కంటి పొడవు 0.76 మీటర్లు, ముక్కు పొడవు 1.37 మీటర్లు, కుడి చేయి పొడవు 12.80 మీటర్లు, కుడి చేయి మందం 3.66 మీటర్లు, నడుము మందం 10.67 మీటర్లు, నోటి వెడల్పు 0.91 మీటర్లు, ప్లేట్



ఎత్తు 7.19 మీటర్లు, ఫలకం వెడల్పు 4.14 మీటర్లు, ప్లేట్ మందం 0.61 మీటర్లు, విగ్రహం రాగి పూత మందం 2.57 మి.మీ., విగ్రహం తారాగణానికి ఉపయోగించిన రాగి మొత్తం బరువు 31 టన్నులు, దాని మొత్తం బరువు ఉక్కు నిర్మాణం 125 టన్నులు. కాంక్రీట్ బేస్ మొత్తం బరువు 27,000 టన్నులు. చెక్క అచ్చులతో తయారు చేయబడిన రాగి పలుచని షీట్లతో విగ్రహం నిర్మించారు. అప్పుడు ఏర్పడిన షీట్లను ఉక్కు చట్రంలో అమర్చారు. పర్యాటకులు ఫెర్రీ ద్వారా విగ్రహాన్ని చేరుకుంటారు. పీఠం వద్ద ఉన్న మ్యూజియంలో విగ్రహం చరిత్రకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. లిఫ్ట్ ద్వారా మ్యూజియం చేరుకోవచ్చు. లిబర్టీ ఐలాండ్ (ఫ్రీడమ్) భూభాగం వాస్తవానికి న్యూజెర్సీ రాష్ట్రానికి చెందినది. తరువాత న్యూయార్క్ ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుని నిర్వహిస్తోంది. ప్రస్తుతం సమాఖ్య పరిపాలనలో ఉంది. 1956 వరకు ఈ ద్వీపాన్ని 'బెడ్లోస్ ఐలాండ్' అని పిలిచేవారు. ఆ తరువాత దీన్ని 'లిబర్టీ ఐలాండ్' అని పిలుస్తున్నారు. ప్రతి ఏడాది దాదాపు 50 లక్షల మంది పర్యాటకులు ఈ విగ్రహాన్ని చూడటానికి వస్తుంటారు. ❒





# బ్రిటన్‌కు 'రిషి' మంత్రం

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు

**బ్రిటీష్ సామ్రాజ్యం ఒక్క భారతదేశాన్నే కాదు.. ప్రపంచంలోని పలు దేశాలను పాలించింది. మనల్ని అయితే ఏకంగా రెండు శతాబ్దాలుగా పాలించడమే కాకుండా మన దేశ సంపదను దోచుకుపోవడం కూడా జరిగింది. ప్రపంచంలో తమదే అగ్రస్థానం అంటూ గర్వంగా చెప్పుకున్న బ్రిటన్ నేడు సంక్షోభంలో కూరుకుపోవడంతో బ్రిటన్ ఘన చరిత్రకు బీటలు వారడం మొదలయ్యాయి.**

ఇటువంటి సమయంలో దేశాన్ని ఒడ్డున పడేయడానికి మరమ్మత్తులు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కాకపోవడంచేత కేవలం రెండు నెలలలోనే ఇద్దరు ప్రధాన మంత్రులను మార్చి తుదకు శ్వేత జాతీయేతరుడు మైనార్టీ వర్గానికి చెందిన భారతీయ హిందూ మూలాలున్న కన్జర్వేటివ్ పార్టీకి చెందిన రిషీ సునాక్ ప్రధానమంత్రి పదవికి ఎంపిక చేయడం జరిగింది. అంతేకాదు.. 200 ఏళ్ల బ్రిటన్ చరిత్రలో అతి పిన్న వయస్కుడైన ప్రధానిగా 42 ఏళ్ల రిషి ప్రధాని పదవి చేపట్టారు. ఆధునిక బ్రిటన్ చరిత్రలో ఎంపీగా తొలిసారి ఎన్నికై తొమ్మిదేళ్లలోనే డేవిడ్ కామెరూన్ ప్రధానమంత్రి పదవిని చేపట్టడం ఇప్పటివరకు బ్రిటన్‌లో విశేషంగా చెప్పుకునేవారు.

అటువంటిది కామెరూన్ రికార్డులను వెనక్కి నెట్టి పార్లమెంటు లోకి ప్రవేశించిన కేవలం ఏడేళ్లలో మొదటి అయిదేళ్లకే ఆర్థిక మంత్రిగా, ఆపైన రెండేళ్లకే ప్రధాన మంత్రిగా రిషి సునాక్ బ్రిటన్ పాలనా పగ్గాలను చేపట్టడం చారిత్రక విశేషంగా చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నట్లు ఇటువంటి అద్భుతాలు ప్రజాస్వామ్య దేశాల్లోనే సాధ్యమవు తాయి అనేది అక్షర సత్యమని భావించాలి.

బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ రాజీనామా అనంతరం జరిగిన ఎన్నికల్లో రిషి ప్రధాన మంత్రి ఎన్నికలలో పాల్గొన్నప్పటికీ అపజయం పాలయ్యాడు. అయితే విజయం సాధించి ప్రధాని బాధ్యతలు చేపట్టిన లీజ్ ట్రస్ తాను తీసుకున్న నిర్ణయాలు కారణంగా దేశాన్ని మరింత సంక్షోభం లోకి నెట్టింది. ఈ సందర్భంలో మరో ప్రత్యామ్నాయ మార్గం తనకు కనిపించక కేవలం 45 రోజుల పాటు మాత్రమే బ్రిటన్ ప్రధానిగా కొనసాగి ట్రస్ ఆ పదవికి రాజీనామా చేశారు. అయితే లిజ్ ట్రస్ మాత్రం తాను పదవి నుంచి తప్పుకోవడానికి ఎవరిపైనా తప్పిదాలు వేయలేదు, ఎవరినీ నిందించలేదు.

తాను ప్రవేశపెట్టిన మినీ బడ్జెట్ ఆలోచనలు పౌండ్ విలువ భారీగా తగ్గడానికి, మార్కెట్ పతనానికి కారణమయ్యాయని భావించింది. దాని ఫలితంగా ఏర్పడిన సంక్షోభం ముదరక ముందే ట్రస్ రాజీనామా చేశారు. ఇటువంటి పరిస్థితులలో ప్రధాని పదవి కోసం మూడవ పర్యాయం జరిగిన ఎన్నికల్లో రిషితో పాటు మరో ఇద్దరు పోటీ నిలవగా రిషికి లభించిన ఆదరణ చూసి ఆ ఇద్దరు కూడా పోటీ నుంచి తప్పుకోవడంతో రిషి ప్రధానిగా నియమింప బడ్డారు. సాధారణంగా అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాలలో ప్రభుత్వాధికారులు ఇలా తరచూ మారే అనిశ్చిత పరిస్థితులు కనిపించవు.

బ్రిటన్‌లో ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభవం ఈ పరిస్థితి కారణంగా నిలిచింది. ఇటువంటి స్థితిలో ప్రధానిగా ఎంపిక కాబడిన భారత సంతతికి చెందిన రిషి సునాకి పేరు ప్రస్తుతం ప్రపంచ మంతా మార్మోగిపోతూ ఉంది. ఇతని కుటుంబ, రాజకీయ నేపథ్యం, ప్రత్యేకతలు, అతనిపై వచ్చిన వివాదాలు..

## కుటుంబ నేపథ్యం

ఇంగ్లండ్‌లోని సౌథంప్టన్ నగరంలో రిషి సునాక్ జన్మించారు. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలోని భిన్న ప్రాంతాల నుంచి బ్రిటన్‌కు వలస వచ్చారు. వీరి మూలాలు భారత్‌లోని పంజాబ్‌లో ఉన్నాయి. రిషి తండ్రి యశ్వీర్ కెన్యా నుంచి; రిషి

తల్లి ఉష టాంజానియా నుంచి బ్రిటన్‌కు వచ్చారు. యశ్వీర్ వైద్యుడిగా పని చేసేవారు. ఉష మందుల షాపును నడిపేవారు. రిషి మాత్రం ఆర్థిక రంగాన్ని కెరియర్‌గా ఎంచుకున్నారు. వెంచెస్టర్ కాలేజీలో రిషి చదువుకున్నారు. వేసవి సెలవుల్లో సౌథంప్టన్ కర్రీ హౌస్‌లో వెయిటర్‌గా ఆయన పని చేశారు. ఆ తర్వాత ఆక్స్‌ఫర్డ్‌లో ఫిలాసఫీ, పాలిటిక్స్, ఎకనామిక్స్ చదువుకున్నారు. స్టాన్‌ఫర్డ్ నుంచి ఎంబీఏ పూర్తి చేశారు.

**అక్షతతో వివాహం**

ఎంబీఏ చదువుతున్న సమయంలో అదే విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదువుతున్న ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కుమార్తె అక్షతతో స్నేహం ఏర్పడింది. ఆ స్నేహం కాస్తా ప్రేమగా మారింది. అయితే అత్యంత క్రమశిక్షణ కలిగిన కుటుంబం నుంచి వచ్చిన అక్షత తమ ప్రేమ విషయం తన తల్లిదండ్రులకు చెప్పి వారి అనుమతితోనే ముందుకు వెళ్లాలని తన ప్రేమ ప్రతిపాదనను తల్లిదండ్రుల ముందు ఉంచింది. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ప్రత్యక్షంగా రిషిని కలిసి అతని వ్యక్తిత్వాన్ని నిశితంగా పరిశీలించి అతనిలో నిబద్ధం అంతకన్నా ప్రధానంగా తనలోని నిజాయితీ ఎంతో ఆకట్టుకొన్న తరువాత తమ కుమార్తె ఎంపిక సరైందని భావించి అక్షత ప్రతిపాదనను అంగీకరించి 2009లో బెంగళూరులో వారిద్దరికీ వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. కృష్ణ(11), అనౌష్క(9). “తన జీవిత భాగస్వామి కావడం అందునా నారాయణమూర్తి సుధామూర్తిగారి కటుంబంలోనికి నేను ప్రవేశించడం మరపురాని అనుభూతి అంటూనే అక్షతకు క్రమశిక్షణ లేదని అయితే అద్భుతమైన సమయస్ఫూర్తి ఉందని, నాలో క్రమశిక్షణ, తనలో సమయస్ఫూర్తి సమతౌల్యం చేసుకుంటూ కుటుంబాన్ని ముందుకు తీసుకుపోతున్నాం” అని తరచూ రిషి చెబుతూ ఉంటారు. రిషి అక్షతను వివాహం చేసుకోవడం ద్వారా మన దేశానికి అల్లుడుగా కూడా పరిచయమయ్యాడు.

2001 నుంచి 2004 మధ్య కాలంలో రిషి గోల్డ్‌మన్ సాక్స్‌లో విశ్లేషకుడిగా పని చేశారు. రెండు హెడ్జ్ ఫండ్స్‌లలోనూ విధులు నిర్వర్తించారు. 2014 బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో రిచ్‌మండ్ నుంచి పోటీ చేసి ఆయన గెలిచారు. 2017, 2019 ఎన్నికల్లోనూ ఆ స్థానంలో ఆయన గెలిచారు. మొదట కేంద్ర సహాయక మంత్రిగా, ఆ తర్వాత ఛాన్సలర్‌గా పని చేశారు. బ్రిటన్ క్యాబినెట్‌లో ఛాన్సలర్ అనేది రెండో ముఖ్యమైన మంత్రిత్వ శాఖ. ఈ పదవిని చేపట్టిన తొలి భారత సంతతి వ్యక్తి రిషి కావడం విశేషం. బ్రెగ్జిట్, ఆ తరువాత కరోనా సంక్షోభంతో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ గడ్డుకాలం ఎదుర్కొంటున్న సమయంలో 2020లో ఆ దేశ ఆర్థికశాఖ పగ్గాలు చేపట్టారు రిషి సునాక్. ఆ సమయంలో ఆయన పనితీరుకు ఎన్నో ప్రశంసలు దక్కాయి.



**తల్లిదండ్రులే స్ఫూర్తి**

తాను రాజకీయాల్లోకి ప్రవేశించడానికి తల్లిదండ్రులే స్ఫూర్తి అని తరచూ చెబుతూ ఉంటారు రిషి. తన తల్లి, తండ్రి వైద్యసేవలు అందిస్తూ ప్రజలకు సేవ చేయడాన్ని చూస్తూ తాను పెరగడం, దాంతో పాటు తన తల్లిదండ్రులు



సమాజానికి అందించిన సేవలపై ఎన్నారై సమాజం చూపిన ఆదరణ మరువలేనిదని తాను రాజకీయాల్లోకి వచ్చేందుకు అదే ప్రేరణగా నిలిచినట్లు రిషి చెబుతారు.

**ఆచరణాత్మక హిందువు**

బ్రిటన్‌లో స్థిరపడినప్పటికీ తమ కుటుంబం ఇప్పటికీ భారతీయ ఆచార సంప్రదాయాలనే పాటిస్తున్నదని రిషి బహిరంగంగానే ప్రకటించారు. తరచు తాను బ్రిటిష్ ఇండియన్‌గా ప్రకటించుకున్నారు. తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించే ముందు తాను హిందువునని కూడా ఆయన చెప్పుకున్నారు.

రిషి సునాక్ గతంలో ఇచ్చిన అనేక ఇంటర్వ్యూల్లో తాను ఆచరణాత్మక హిందువునని ధైర్యంగా చెప్పారు. బ్రిటన్ హౌసాఫ్ కామన్స్ సభ్యుడిగా భగవద్గీతపై ప్రమాణం చేశారు. జనాభా లెక్కల సేకరణకు వచ్చిన అధికారులకు ఇచ్చిన పత్రంలోనూ బ్రిటిష్ ఇండియన్ కేటగిరీ మీద టిక్కు పెడతానని రిషి సునాక్ ఎలాంటి బెరుకు లేకుండా ప్రకటించారు. తాను పూర్తిగా బ్రిటిష్‌వాడిని అయితే సంస్కృతి రీత్యా తాను భారతీయుడినని, హిందువునని బాహాటంగానే వెల్లడించారు రిషి. అంతేకాదు.. తాను ఎప్పుడైనా మానసికి ఒత్తిడికి లోనైతే ఆ సమయంలో భగవద్గీత చదివి ఒత్తిడి తగ్గించుకుంటానని చెప్పడం హిందూ ధర్మంపై ఆయనకు ఉన్న నమ్మకానికి నిదర్శనం.

రిషి సునాక్‌కు భారతదేశమన్నా భారతదేశ సంప్రదాయాలన్నా అమితమైన గౌరవం. అందుకే దీపావళి సహా అన్ని భారతీయ పండగలను సెలబ్రేట్ చేసుకోవడానికి రిషి ఇష్టపడుతుంటారు.

తాజాగా రిషి ప్రధానిగా పార్లమెంట్ తొలి భేటీలో హిందువులకు పవిత్రమైన దీక్షా కంకణం (మంత్రించిన ఎర్రతాడు) ధరించి పాల్గొన్నారు. దుష్ప్రభావాలు పోయి మంచి జరగడానికి దీనిని ధరిస్తే దేవుడు రక్షగా ఉంటాడని హిందువులు నమ్ముతారు. హిందూ మత విశ్వాసాలకు చెందినవారు దీనిని చేతికి ధరించడంతో రిషి తాను నమ్ముకున్న సంప్రదాయాలను ఎంతో గౌరవిస్తారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

బ్రిటన్‌వాసులు విశాల హృదయులు మతాన్నీ, రాజకీయాలనూ మిళితం చేయకపోవడం, వేరు వేరుగా పరిగణించడం బ్రిటన్ ప్రజల్లో ఉన్న ఒక గొప్ప సుగుణం. అందువల్లే తనను తాను హిందువుగా పరిచయం చేసుకోగలిగానని రిషి చెబుతూ ఉంటారు. అమెరికా రాజకీయ జీవితంలో మతం విస్తరించి ఉందని, కానీ ఇంగ్లండ్‌లో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. 95 శాతం శ్వేత జాతీయులు ఉన్న రిచ్మండ్ నుంచి తాను వరుసగా బ్రిటిష్ పార్లమెంటుకు ఎన్నిక కావడమే బ్రిటన్‌వాసుల విశాల హృదయులు అనడానికి నిదర్శనమని

రిషి సునాక్ ఎప్పుడూ చెబుతుంటారు.

**కన్జర్వేటివ్ పార్టీపై మక్కువ**

బ్రిటన్‌లో పలు రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ కన్జర్వేటివ్ పార్టీకి ప్రజల పట్ల ఉండే నిబద్ధత, దయాగుణం అధికమని ఆ పార్టీలో నెలకొన్న విలువలే నన్ను ఆ పార్టీ వైపు నడిపించాయని అదే సమయంలో నేను శ్వేత జాతీయేతరుడు అయినప్పటికీ బ్రిటిన్ గొప్ప అవకాశాలు అందించిందని చెబుతారు రిషి.

**రిషి ప్రత్యేకతలు**

ఉన్నది ఉన్నట్లుగా అర్థవంతంగా మాట్లాడటమే కాదు.. తన ఆలోచనలు మీద స్పష్టత కలిగిన నాయకుడిగా గుర్తింపే రిషి అసమాన ఎదుగుదలకు ఆలంబన అయ్యింది. ప్రధానంగా రిషి ఆర్థిక రంగంపై మంచి పట్టుంది. రాజకీయాల్లోకి రాకముందు అమెరికాలో పలు పేరొందిన ఆర్థిక సంస్థల్లో పని చేశారు రిషి. అంతేకాక కరోనా సమయం లో సునాక్ చేపట్టిన కొన్ని సంస్కరణలు సత్ఫలితాలిచ్చాయి. ఈ సమయంలో వ్యాపారులు, కార్మికుల కోసం వందల కోట్ల పౌండ్ల ప్యాకేజీ తీసుకొచ్చి రిషి మంచి గుర్తింపు పొందారు. దీంతో సునాక్‌పై నమ్మకం కలిగింది. ఇప్పుడు ఆ నమ్మకమే బ్రిటన్ పీఠాన్ని కట్టబెట్టింది.

**వివాదాలు**

రిషిని ప్రశంసల కన్నా వివాదాలే ఎక్కువ చుట్టుముట్టాయి. ప్రతిపక్ష లేబర్ పార్టీనే కాకుండా స్వంత కన్జర్వేటివ్ పార్టీ కూడా రిషిపై ఎన్నో వివాదాలను వెలుగులోకి తీసుకువచ్చింది. అయితే రిషి వాటన్నింటికీ ధీటుగా సమాధానం చెప్పాడు. చాలా వాటిని పరిష్కరించుకున్నాడు. అవి:

రిషి అందరివాడు కాదు

రిషి విలాసవంతమైన జీవితం కూడా ఆయనకు కాస్త చేటు చేసిందనే చెప్ప వచ్చు. కరువు గుప్పిట్లో చిక్కిన బ్రిటన్‌లో గుక్కెడు నీళ్ల కోసం జనం విలవిల్లాడుతుం టే రిషి యార్క్‌షైర్‌లోని తన కొత్తింట్లో 4 లక్షల పౌండ్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మించడం వివాదాస్పదమైంది. "నా ఫ్రెండ్స్ అంతా ధనవంతులే. నా స్నేహితుల్లో సామాన్యులెవరూ లేరు" అంటూ ఎప్పుడో ఆయన మాట్లాడిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో రిషి అందరివాడు కాదన్న ప్రచారానికి బలం చేకూరింది.

**ఆస్తుల ప్రకటన వివాదం**

బ్రిటన్ మంత్రివర్గ నియమావళి ప్రకారం సునాక్ తనకు సంబంధించిన ఆర్థిక విషయాలను ప్రజలకు వెల్లడించడం అతడి బాధ్యత. మినిస్టీరియల్ రిజిస్టర్ ప్రకారం మంత్రులు తమ కుటుంబం ఆధీనంలో ఉన్న ఆస్తుల గురించి అంటే తోబుట్టు వులు, తల్లిదండ్రులు, భార్య, అత్త-మామల పేర్ల మీద ఉన్న ఆస్తుల గురించి వెల్లడించడం తప్పనిసరి. అయితే సునాక్ మాత్రం అతడి భార్య మినహా ఇతర కుటుంబ సభ్యుల పేర్ల మీద వున్న ఆస్తులను వెల్లడించలేదు. అంతేకాదు, తాను ఒక చిన్న యూకే ఆధారిత వెంచరల్ క్యాపిటల్ కంపెనీకి యజమానిగా మాత్రమే ప్రకటించుకున్నారు. దాంతో రిషి సునాక్ ఆర్థిక వ్యవహారాల గురించి పలు




అనుమానాలు తలెత్తాయి. తన భార్య, అతడి కుటుంబ సభ్యులు పలు కంపెనీల్లో మల్టీ మిలియన్ పౌండ్ల విలువ జేసే షేర్ హోల్డింగ్స్, డైరెక్టర్‌షిప్స్ కలిగివున్నారనీ, కానీ వాటి గురించి ఆయన అధికారికంగా ప్రకటించలేదని విమర్శలు వెల్లువెత్తాయి.

**గ్రీన్ కార్డ్ వివాదం**

అమెరికా గ్రీన్ కార్డు వివాదం కూడా రిషికి వ్యతిరేకంగా మారింది. రిషి అమెరికా నుండి బ్రిటన్‌కు నివాసం మార్చిన తరువాత కూడా గ్రీన్ కార్డును ఆయన రద్దు చేసుకోలేదని, ఎప్పటికైనా అమెరికాకు వెళ్లిపోవడానికే ఈ పని చేశారని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో రిషి ఆర్థిక మంత్రి కాగానే గ్రీన్ కార్డును వదులుకు న్నానని ప్రకటించారు. అయితే అప్పటికే రిషిపై వ్యతిరేక ప్రచారం విస్తృతంగా వ్యాప్తి చెందింది.

**అక్షత పన్ను వివాదం**

రిషి భార్య అక్షత భారత పౌరురాలు. అందువల్ల ఆమెను బ్రిటిష్ చట్టాల ప్రకారం నాన్-డొమిసిల్డ్‌గా పరిగణిస్తున్నారు. ఎందు కంటే భారత ప్రభుత్వం తన పౌరుల్ని ఏక కాలంలో మరో దేశ పౌరసత్వాన్ని కలిగి వుండేందుకు అనుమతించని కారణంగా అక్షతను బ్రిటన్‌లో నివాసం లేని వ్యక్తిగా పరిగణించడం జరిగింది. అక్షతా మూర్తికి ఇన్ఫోసిస్‌లో దాదాపు 0.93 శాతం వాటా వుంది. అయితే ఆమె నాన్-డొమిసిల్డ్ అనే అంశాన్ని ఉపయోగించుకుని భారతీయ వ్యాపారంపై వచ్చే డివిడెండ్లపై బ్రిటన్‌లో పన్ను చెల్లించడం లేదనే విమర్శలు పెరిగాయి.

ఈ విమర్శలకు స్పందించిన అక్షత "నా పన్ను, హోదా నా కుటుంబ సభ్యులకు ఇబ్బందిగా మారకూడదని భావిస్తున్నాను. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా లభించే ఆదా యంపై యూకెలో పన్ను చెల్లిస్తాను" అని అక్షత ప్రకటించారు. ఇదే సందర్భంలో గార్డియన్ పత్రిక అక్షతకు ఇన్ఫోసిస్ కంపెనీలో 430 మిలియన్ పౌండ్లు విలువ చేసే షేర్లు ఉన్నాయనీ, దీని ప్రకారం చూసుకుంటే ఆమె బ్రిటన్‌లో అత్యంత ధనవంతురాలైన మహిళగా క్వీన్ ఎలిజబెత్ కన్నా ధనవంతురాలిగా ఉండనున్నట్లు గార్డియన్ పత్రిక సంచలన కథనం ప్రచురించింది.

**రష్యా.. ఇన్ఫోసిస్ వివాదం**

రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ ప్రభావం అన్ని దేశాలపై పడుతున్న నేపథ్యంలో రిషి భార్య అక్షతామూర్తి తండ్రి ఇన్ఫోసిస్ నారాయణ మూర్తికి చెందిన భారత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రష్యాలో కూడా తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. అయితే అమెరికాతో పాటుగా యూరప్ దేశాలు రష్యాపై కఠినమైన ఆంక్షలను విధించిన నేపథ్యంలో రష్యాలోని ఇన్ఫోసిస్ ఉనికిపై సునాక్‌ను విమర్శలు చుట్టుముట్టాయి. యూకే ఆర్థిక మంత్రి ఇంట్లోనివారు రష్యాలో ఇన్ఫోసిస్‌తో వ్యాపారాలు చేయడం ఎంతవరకు సబబు? అని పత్రికల్లో పతాక శీర్షికలలో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఇన్ఫోసిస్‌కు చెందిన వ్యవహారం పూర్తిగా కుటుంబ సభ్యులే చూసుకుం టారు. నాకు ఎలాంటి సంబంధం లేదంటూ వివరణ ఇచ్చారు. తాజాగా కొద్ది రోజుల క్రితమే ఇన్ఫోసిస్ రష్యాలో తమ కార్యకలాపాలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

**బోరిస్‌కు వెన్నుపోటు వివాదం**

కొవిడ్-19 పార్టీ గేట్ కుంభకోణంలో ఇరుక్కొన్న ప్రధాని బోరిస్ జాన్సన్‌కు రిషి వెన్నుపోటు పొడిచారన్న అభిప్రాయం కన్జర్వేటివ్ పార్టీలో బలంగా ఏర్పడింది. జాన్సన్‌ను రాజకీయ గురువని కూడా చూడకుండా అతనికి వ్యతిరేకంగా పని

చేసి ఆయన రాజీనామా చేయాల్సిన పరిస్థితి కల్పించారని టోరి సభ్యులు విశ్వసించారు. ఆర్థిక మంత్రి పదవికి రిషి రాజీనామా చేయడంతో ఇతర మంత్రులూ అదే బాట పట్టారు. వారికి మద్దతుగా 50 మంది ఎంపీలు కూడా రాజీనామా చేయడంతో ఒత్తిడి పెరిగి జాన్సన్ గద్దె దిగాల్సి వచ్చింది. దీన్ని నమ్మకద్రోహంగానే టోరిసభ్యులు చూశారు. ఆ వెంటనే రెడీ ఫర్ రిషి అంటూ పోటీకి దిగి దూకుడుగా ప్రచారానికి తెర తీయడంతో ప్రధాని పదవి కోసమే అంతా చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. బోరిస్ కూడా రిషికి వ్యతిరేకంగా పని చేశారు. అయితే అప్పుడు లిజ్ ట్రస్ విజయం సాధించారు.

**సమస్యల తోరణాలు**

ఇన్ని వివాదాలు ఉన్నప్పటికీ వాటిని చాకచక్యంగా సవరించుకుంటూ ముందుకు నడిచిన రిషికి బ్రిటన్ పరిపాలన పగ్గాలు చేపట్టే అవకాశం దక్కడానికి కేవలం అతనిలో ఉన్న ఆర్థిక నిర్వహణా సామర్థ్యం పరిపాలన, దక్షత, కొవిడ్ సమయంలో ఆర్థిక మంత్రిగా ఆయన చేపట్టిన నిర్మాణాత్మక చర్యలు, అంతకు మించి సమస్యల పట్ల అతను స్పందించే గుణమే అనుకోవచ్చు. అందుచేతనే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన బ్రిటన్ గట్టెక్కించే బాధ్యతలను ఎంతో నమ్మకంతో రిషి చేతిలో పెట్టారు. అయితే ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న రిషి సునాక్‌కు తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు తనకు అప్పగించారు అనే ఆనందం కంటే సంక్షోభాన్ని చక్కబెట్టడానికి కార్యాచరణలో ఎదురయ్యే సవాళ్లే ఎక్కువగా ఉన్నాయి. దేవ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే ఇప్పుడురిషి సునాక్ ముందున్న అతి పెద్ద బాధ్యత.

**ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న బ్రిటన్**

రిషి సునాక్‌పై చాలా ఆశలు పెట్టుకుంది. ఒక పక్క ద్రవ్యోల్బణం కారణంగా నింగిని తాకుతున్న ధరలు, పెరిగిపోతున్న జీవన వ్యయం, ముంచుకొస్తున్న మాంద్యం. నా వల్ల కాదు అంటూ పదవిని వదిలిపెట్టిన నిరాశాజనక వాతావరణం.. వీటన్నింటిని అధిగమిస్తూ ప్రజాభీష్టానికి అనుగుణంగా పరిపాలన చేస్తూ సంక్షోభాన్ని గట్టెక్కించడం నిజంగా కత్తి మీద సాము వంటిదే.

**ఆర్థిక సంక్షోభం**

ప్రస్తుతం బ్రిటన్ ద్రవ్యోల్బణం 10 శాతం మించిపోతోంది. జీ7 దేశాల్లో ఇదే అత్యధికంగా నమోదయ్యింది. మరొకపక్క ఆహార ధరలు చుక్కల్ని తాకుతున్నాయి. ఇంకొక పక్క సంపాదన తగ్గుతూ జీవన వ్యయం పెరుగుతోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. దీనికితోడు గత ప్రధాని ట్రస్ తీసుకున్న నిర్ణయాలు దేశాన్ని మరింత ఇక్కట్లకు గురి చేయడం జరిగింది. ఇటువంటి సమయంలో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం అనేది చిన్న విషయం మాత్రం కాదనే చెప్పాలి.

**ఉద్యోగుల సమ్మె ప్రకటనలు**

ద్రవ్యోల్బణం ప్రభావం వల్ల బ్రిటన్‌లో మధ్య తరగతి వర్గం, ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. జీతాలు పెంపు, ఉద్యోగ భద్రత, పెన్షన్లు మొదలైన వాటి విషయంలో ఇప్పటికే పలు ఉద్యోగ



సంఘాలు సమ్మెకు కూడా సిద్ధమయ్యాయి. వీరి సమస్యలను రిషి ఏ విధంగా పరిష్కరించనున్నారో వేచి చూడాలి.

**వలసల సమస్య**

దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న వలసలు బ్రిటన్ ప్రభుత్వానికి తలనొప్పిగా పరిణమించాయి. వలసల విషయంలో తనకు స్పష్టమైన అవగాహన ఉందని దాని పరిష్కారానికి ప్రధాని పీఠం అలంకరించిన పిదప ప్రణాళిక అమలు చేస్తానని గతంలోనే రిషి ప్రకటించడం గమనార్హం.

ఇంధన ధరలు

ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల చమురు ధరలు బ్రిటన్‌లో కూడా నింగినంటాయి. ఇది బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో మార్కెట్లలో బ్రిటన్ కరెన్సీ ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. దీనికోసం ప్రభుత్వం ప్రజలకు మరింతగా ఇంధన వ్యయాల రాయితీలు ఇవ్వడం, సంక్షేమాన్ని మెరుగు పరచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పడిపోయింది.

కాగా, మరో పక్కన ఈ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే పేరిట బ్రిటన్ కేంద్ర బ్యాంక్ వడ్డీరేట్ల ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించింది.

తాజా మాజీ ప్రధాని లిజ్ ట్రస్ సమస్యలను ఎదుర్కొన్నారో అవే సమస్యలు ఇప్పుడు రిషి సునాక్ ముందు అలాగే అపరిష్కృతంగా నిలబడి ఉన్నాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో విశ్వసనీయత, ప్రొఫెషనలిజమ్, జవాబుదారీతనం అత్యంత ఆవశ్యకం. ఇవన్నీ తెలిసి కూడా ముళ్ల కిరీటాన్ని తలపై ధరించారు రిషి. ముఖ్యమైన వేళ కోరి తలపై పెట్టుకున్న ప్రధాని పదవి అన్ని విధాలా ముళ్ల కిరీటమని రిషికి తెలుసు. వీటిన్నింటినీ రాత్రికి రాత్రి పరిష్కరించడానికి రిషి వద్ద మంత్ర దండం ఏదీ లేదని అందరికీ తెలిసిన విషయమే. అయితే రిషి మాత్రం ఈ సంక్షోభం అధిగమించడానికి మనలో స్థిరత్వం, ఐక్యత అవసరం. మన పార్టీని, దేశాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడాన్ని అత్యధిక ప్రాధాన్యంగా భావిస్తున్నాను. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను స్వీకరించడానికి ముందుకు వచ్చినట్లు ప్రకటించారు. మన పిల్లలకు మంచి భవిష్యత్తును అందించేందుకు ఇదొక్కటే మార్గం. ఎంతో చిత్తశుద్ధితో, అణకువతో మీకు సేవ చేస్తానని రిషి హామీ ఇవ్వడం చూస్తే ఆశాజనక పరిణామాలు కలుగుతాయనే ఆశ ప్రజల్లో కనిపించడం మొదలైంది. రిషి ప్రధానిగా ఎన్నిక కావడం అంతర్జాతీయ సంబంధాలలో స్పష్టమైన మార్పు వచ్చే అవకాశం లేకపోలేదు.

**అంతర్జాతీయ సంబంధాలు..**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు ఇప్పటికే బ్రిటన్ సహాయం అందిస్తూ వచ్చింది. తాను ప్రధాని అయితే ఉక్రెయిన్‌కు మరింత సహాయ సహకారాలు అందిస్తానని బహిరంగంగా ప్రకటించారు రిషి. దానితో పాటు బ్రిటన్ జాతీయ భద్రతకు ముప్పుగా వ్యవహరిస్తున్న చైనాను వదిలిపెట్టేది లేదని రిషి పేర్కొన్నారు. చాలా కాలంగా బ్రిటన్‌తో పాటు పశ్చిమ ప్రాంతంలోని రాజకీయ నాయకులు చైనాకు ఎర్ర తివాచీ పరిచారు.

చైనా కుటిల బుద్ధిపై గుడ్డిగా వ్యవహరించారు.

దానిని ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజునే మారుస్తానని" పేర్కొన్నారు.

దానితో పాటు రష్యాపై కూడా బ్రిటన్ భిన్న వైఖరితో ఉంటుందని చెప్పారు. అయితే భారత సంతతికి చెందిన వ్యక్తి బ్రిటన్ ప్రధాని కావడం భారత బ్రిటన్ ద్వైపాక్షిక సంబంధాలపై సానుకూల ప్రభావం చూపెట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇరు దేశాల వాణిజ్య

సంబంధాల్లో భాగంగా ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్టీఏ) మరింత ముందుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**భారత్ స్పందన**

మనల్ని శతాబ్దాల పాటు బానిసలుగా పాలించిన బ్రిటిష్‌వారి సామ్రాజ్యాన్ని భారత సంతతికి చెందిన వ్యక్తి పాలించడం పట్ల భారతీయులందరూ ఆనందాన్ని వ్యక్త పరుస్తున్న ఘడియలు ఇవి. ఇదే సందర్భంలో భారత్‌కు స్వాతంత్ర్యం ఇచ్చే సందర్భంలో మనకు పరిపాలనా సామర్థ్యం లేదు అని వ్యాఖ్యానించిన బ్రిటన్ నేడు అదే భారత సంతతికి చెందిన వ్యక్తిని ప్రధానిగా నియామకం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది అంటూ సామాజిక మాధ్యమాలలో ట్వీట్లు వెల్లువెత్తుతున్నాయి.

అయితే అటువంటి అవకాశాన్ని బ్రిటన్ దేశం రిషి సునాక్‌కు ఇచ్చింది. ముఖ్యంగా రిషికి ముందు ప్రధానిగా వున్న లిజ్ ట్రస్ తన నిర్ణయాల వలన వచ్చిన ప్రతికూల ప్రభావాలను గుర్తించి ఇదే విధానం కొనసాగితే దేశం మరింత నష్టపోతుందని మరిన్ని ప్రయోగాలు చేయకుండా జాప్యం చేయకుండా ఈ పరిస్థితి ఏర్పడటానికి వేరేవాళ్లు కారణం అంటూ ఇతరులపై నెట్టకుండా హుందాగా తన పదవి నుంచి తప్పకుంది లిజ్ ట్రస్. ఇటువంటి ఘటనలు మన దేశంలో సాధ్యమా? ఒక్కసారి పదవి లభిస్తే వ్యవస్థ ప్రయోజనాలు ఎంత దెబ్బ తిన్నా కూడా పదవిని అంటిపెట్టుకుని లోపాలను ఇతరులపై నెట్టే నేతలు మన వర్తమాన రాజకీయ నాయకులు.

ఇటువంటి అంశాలను మనం బ్రిటన్‌తో పోల్చి అవలోకం చేసుకోవాలి.

వారికి మనలాగే తమ, పర అనే భేదాలుంటాయి, జాత్యాభిమానాలు ఉంటాయి. అయినప్పటికీ దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని తర తమ భేదాలు పక్కకు పెట్టి వాటికి అతీతంగా మేధస్సు ప్రతిభా పాటవాలే పరమావధిగా శ్వేత జాతీయేతరుడు, మైనార్టీ వర్గానికి చెందిన భారతీయ హిందూ మూలాలు కలిగిన వ్యక్తిని దేశ ప్రధానిగా ఎంపిక చేశారు. బ్రిటన్ తీసుకున్న ఈ నిర్ణయం ఏమాత్రం చిన్న విషయం కాదనే చెప్పాలి. ఈ విషయంలో రిషితో పాటు బ్రిటన్ దేశం తీసుకున్న నిర్ణయాన్ని కూడా అభినందించాలి. అదే సమయంలో మనం గర్వపడాల్సిన సంఘటన ఇది. అయితే ఇక్కడ బ్రిటన్ దేశ ప్రధానిపదవిని మన సంతతివాడు చేజిక్కించుకున్నాడు అనడం కన్నా మన సంతతికి చెందిన వ్యక్తికి బ్రిటన్ అవకాశం కల్పించింది అంటే సముచితంగా ఉంటుందేమో! రిషికి బ్రిటన్ అందించిన ఇటువంటి అవకాశాన్ని ఉద్దేశించి తాజాగా అమెరికా ప్రెసిడెంట్ "ఇటువంటి చారిత్రక నిర్ణయాలు కేవలం ప్రజాస్వామ్య దేశాలకే సాధ్యం.." అంటూ ఇచ్చిన కితాబు మనకు తెలిసిందే. అయితే ప్రజాస్వామ్య దేశంగా కొనియాడబడే మన దేశంలో ఇటువంటి అవకాశాలను సాధారణ నాయకులకు వారసత్వం లేనివారికి, ఆర్థిక సామర్థ్యం లేనివారికి కల్పించగలదా? దేశ పరిపాలన చేపట్టే ప్రజా ప్రతినిధులు ముఖ్యంగా ప్రభుత్వాధి నేతల ఎంపికలో రిషి సునాక్ తరహా మైనార్టీ వ్యక్తులకు




మనం అవకాశం ఇవ్వగలమా? మన దేశం కానివారికి ప్రతిభ ఆధారంగా అందలం ఎక్కించగలమా? మన దేశంలోనే ఉత్తరాది, దక్షిణాది అనే వివక్షలు కొనసాగుతున్న సమయంలో అన్ని ప్రాంతాలకు అధికార పగ్గాలు అందించడానికి అంగీకరించిందని మనం మన దేశాన్ని మరొకరు పాలించడానికి సుతారాము అంగీకరించడం. ఎందుకంటే మనకు పరిపాలన సామర్థ్యం ఉంది. అందుకే అనేక దేశాల్లో మన సంతతికి చెందినవాళ్లు కీలక స్థానాల్లో అధికార పీఠాన్ని చేపట్టినవాళ్లు ఉన్నారు. అంతే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ఐటీ దిగ్గజ కంపెనీలకు సీ.ఈ.ఓ.లుగా మన భారతీయులు అగ్ర భాగాన ఉన్నారు. ఇది మనం గర్వించదగ్గ విషయమే. అయితే అటువంటి ప్రతిభావంతులకు మనం అంతటి అవకాశాలు ఇవ్వగలిగితే ఇతర దేశాలకు మేధోవలస జరిగిఉండేది కాదు. దీనినిబట్టి మనం ఎవరికో అవకాశం ఇవ్వడం మాట పక్కన పెడితే మన దేశంలో ఉన్న విభిన్న వర్గాల వారికి అవకాశాలు కల్పించడంలో మనం చూపే వివోత అనేది తక్కువేం కాదు. మనం వివక్షత చూపుతూనే మరో దేశంలో మనవాడు జెండా ఎగరేశాడంటూ సహజమైన సంతోషాన్ని వ్యక్తం చేయడం అత్యంత సహజ పరిణామం.

సోనియా గాంధీ ప్రధాని అభ్యర్థిత్వం వచ్చిన సందర్భంలో ఆ ప్రతిపాదనపై రాజకీయ పక్షాలకు అతీతంగా అందరూ చివరకు స్వంత పార్టీవారు సైతం వ్యతిరేకించిన సందర్భం మనకు తెలిసిందే. అయితే సోనియా ఇక్కడ జన్మించలేదు. రిషి మాత్రం బ్రిటన్‌లో జన్మించారు అంటూ సోనియా ప్రతిపాదన వ్యతిరేకించడానికి అనేక కారణాలు చెబుతున్నారు. విదేశీయుల వరకూ ఎందుకు? మన దేశంలో ప్రతిభావంతులయిన యువత ఎంతో మంది ఉన్నారు. వారిని ఉపయోగించుకోవాలి తప్ప ఇతర ప్రయత్నాలు వృధా.. నిజమే!

అయితే రాజకీయ వారసత్వం లేకుండా, ఓట్లను కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేనివారు పదవులకు పోటీ చేసే అవకాశం మన దేశంలో ఉన్నదా? బ్రిటన్‌లో మనవాడు దేశ పరిపాలన పగ్గాలు చేపట్టాడాదు అని గర్వపడే ముందు మనం బ్రిటిన్‌లో జరిగిన సంఘటనలను కూడా అవలోకం చేసుకుంటే మన ప్రయాణం ఏ దిశగా ఉంది అనేది అవగతమవుతుంది. మన దేశంలో బ్రిటన్ తరహా నిర్ణయాలు అమలులో సాకారం కావడం అనేది సాధ్యం కాదనే చెప్పవచ్చు. అంతేకాదు, భారత జాతి సంతతికి చెందిన మన రిషి సునాక్ బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను సంక్షోభం నుండి బయట పడేస్తాడని చెప్పడం కూడా అతిశయోక్తి అవుతుంది. ఎందుకంటే ప్రస్తుతం బ్రిటిన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. ఒక పక్క ద్రవ్యోల్బణం, మరొక పక్క ముంచుకొస్తున్న ఆర్థిక మాంద్యం వలసలు, ఆహార సంక్షోభం.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి వాటిని ఎదుర్కొని వ్యవస్థను చక్కదిద్దాలి అంటే ఒక్కడి వలన అందునా రాత్రికి రాత్రి సాధ్యం అయ్యేది కాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బ్రిటన్‌లో అద్భుతాలు సాధించడం అనేది సాధ్యపడే విషయం కాదనే చెప్పవచ్చు. ఏది ఏమైనా రిషి పరిపాలనా దక్షతతో బ్రిటన్‌ను సంక్షోభం నుంచి బయట పడేయాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం. దానితో పాటు భారత బ్రిటన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగు పడాలని కోరుకుందాం. ❑


## పిల్లలకు నచ్చే నాన్నమ్మ చెప్పిన కథలు



కథలు, గేయాలు, వ్యాసాలు, రేడియో నాటికలు వచన కవితలు, పుస్తక సమీక్షలు తెలుగు సాహిత్యంలో యించుమించు అన్ని ప్రక్రియలలో సుపరిచిత రచయితగా ప్రశంసాయుతమైన ప్రతిభతో రాణిస్తున్న కూర చిదంబరం 'నాన్నమ్మ చెప్పిన కథలు' వినిపించారు. తన అనుభవాలు, పాఠాలు వ్యాససంకలనంలో తన బాల్యంలో అమ్మమనసు, నాన్న హృదయం ఆవిష్కరింపచేసిన, చిదంబరం తాతగా చిన్నారులను కథలతో ఆకట్టుకోవడంలోని అనుభవసాఫల్యత ఈ కథలలో చూడవచ్చు. వెన్నెల రాత్రుల్లో పిల్లలకు కథలు చెప్పి అందమైన ఊహాలోకాలలో విహరింప చేసే ఆలోచనతో చిదంబరం ఈ కథలు సృష్టించారు. ఉబుసుపోక కాలక్షేపం కాకుండా, ప్రతి కథ నీతివంతంగా రూపొందించటం బాలబాలికలకు అత్యంత యిష్టమైన జంతుకథనాలుగా సందేశాన్ని అందించడం ఈ కథలలో స్పష్టంగా వినపడుతోంది. చిన్నారుల బాల ప్రపంచంలోకి, పెద్దలను కూడా రచయిత తీసుకువెళ్లి బంగారు బాల్యం గుర్తు చేస్తారు. 'మోసం చేయవద్దు' తొలి కథగా 'దేవుడికి ధన్యవాదాలు' ఆఖరి కథ వరకు చిన్నారుల లేత మనసులకు నీతివంతమైన శ్రేయస్సుతో రచయిత ఆసక్తివంతంగా అడుగులు వేయించే ప్రయోజనం స్పష్టమౌతుంది. చిన్నారులతో ప్రతీ ఇంటా అమ్మనాన్నలు లేదా తాతలు, పెద్దలు ఈ కథలను వినిపించడం లేదా చదివింప చేయగలిగే సత్కృషికి బాల సాహితీవేత్తగా చిదంబరం కృతకృత్యత సాధించినట్టే. పిల్లలకు ఆసక్తి కలిగించే బొమ్మలున్నాయి. రచయిత అభినందనీయులు.

**(నానమ్మ చెప్పిన కథలు, రచన: కూర చిదంబరం, వెల: రూ 100, ప్రతులకు:నవోదయ బుక్‌హౌస్)** – ఎర్రమిల్లి

## బతకటం భౌతికస్థితి, జీవించటం అమూర్తభావన



జీవితం ఏమిటి? అన్న ప్రశ్నకు సమాధానంగా 'రెండు దోసిళ్ల కన్నీరు, దోసెడు చిరునవ్వులు, గుప్పెడు చీకటి, మరో గుప్పెడు వెలుగు' అన్న సమాధానం దొరుకుతుంది. కవి, తాత్వికుడు కథకుడు అయిన డా॥వెన్నం ఉపేందర్ నవల 'మత్తడి దునికిన కోపుల నీళ్లు' చదువుతోంటే..బడుగు బ్రతుకుల్లో ఇన్ని కష్టాలుంటాయా? అనిపించకమానదు. 'ఎన్ని కష్టాలుంటేనేమి చివరకు కోపుల నీల్లోలె స్థిరంగా ఉన్న ఈ పిలగాని బ్రతుకుల మత్తడి దునికింది' అని విశ్వసిస్తాము. అసలీ పుస్తకం నవలలా అనిపించదు. ఎవరి యదార్థ జీవితమో, పుటలకెక్కించి, 'దృఢ సంకల్పం, పట్టుదల, నేతి గరిటంత అదృష్టము ఉంటే కట్టుకోను సరైన బట్ట, కడుపునింపుకోను పిడికెడు మెతుకులకు కటకట పడేవారు కూడా ఇంజినీర్లు అవొచ్చు, సివిల్స్ పేసవొచ్చు.. అని చెప్పే ఆశావహ దృక్పథం కనిపిస్తుంది. అమ్మను గ్లోరిపై చేసిన తీరు చాలాబాగుంది.

అలిసిసొలిసి చెమటపట్టిన నుదుటిపై చిరుగాలి ముద్దు పెడుతున్నట్లు, రోమాల్లో జల ఉబుకుతున్న అనుభూతి కలిగాయి. మనం నడిచే దారిలో పరిచిన పల్లేరు కాయల ముళ్లు గుచ్చుకుంటూనే ఉంటాయి. తెలంగాణ యాస, భాషలో సాగిన ఈ నవల ఆప్రాంతపు చరిత్రహీనుల వెతలు కళ్లకు కడతాయి.


**(మత్తడి దునికిన కోపుల నీళ్ళు, రచన: డా॥ వెన్నం ఉపేందర్, వెల: రూ 100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట, హైదరాబాద్-500036)**

**- కూర చిదంబరం**

# పుస్తక సమీక్ష

బి.ఎస్.ఎమ్.కుమార్ రచించిన పది కథల సంపుటి 'దేహ నాగరలిపి'. ఇదొక విచిత్రమైన కథల సంకలనం. విచిత్రం ఎందుకంటే, పదాల అర్థాలు తెలుస్తుంటాయి. వాక్యాల అర్థం బోధపడుతుంటుంది. కానీ వాక్యాల నడుమ సంబంధం అర్థం కాదు. పలు వాక్యాలు కలిపి చదివితే వాటి నడమ సంబంధంతో పాటు

## విచిత్రమైన కథల సంకలనం




మొత్తం అర్థం, భావం బోధపడవు. కానీ అంతా అర్థమయినట్టు అనిపిస్తుంది. కానీ ఏదీ అర్థం కాదు. ఈ పుస్తకానికి ముందు మాటతో ఆరంభమయిన అయోమయం పుస్తకం చివరివరకూ సాగుతుంది. కథలో పాత్రలు తెలుస్తాయి. ఆ పాత్ర తాగుబోతు, తిరుగుబోతో, నిరాశలో ఉన్నదో, నిస్పృహకు లోనయిందో తెలుస్తుంటుంది. కానీ ఏం జరుగుతుందో ఎంత తరచి చూచినా బోధపడదు. చివరకు పాత్రలలో, వాటి ప్రవర్తనలో, సంఘటనల్లో వర్ణనల్లో ప్రతీకలను ఊహించి అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటాయి. ఏదో ఉందని తెలుస్తుంటుంది. ఏముందో తెలియదు. బహుశా ఈ కథలు సామాన్య పాఠకుల కోసం రచించినవి కావనిపిస్తుంది. రచయిత ప్రత్యేకమైన భావవ్యక్తీకరణ పద్ధతిని, ప్రతీకలను సృజించుకుని తెలుగు భాషలో వాటిని వ్యక్తీకరించాడనిపిస్తుంది.

**(దేహనాగరలిపి (కథలు), రచన: బి.ఎస్.ఎమ్ కుమార్, వెల: రూ300, ప్రతులకు అన్ని పుస్తక కేంద్రాల్లో)**

**- నిర్మోహి**

తన చుట్టూ వున్న సమాజాన్ని 'అంతర్లీనం'గా దర్శించి 55 కవితలతో వ్యక్తమవుతున్న కవయిత్రి అద్దగూరి శ్రీలక్ష్మి. 'ఆవేశాన్ని సిరాగా/ ఆక్రందనల్ని ఆసరాగా/ అక్షరాల్ని ఆయుధాలుగా/ ప్రశ్నించే సాయుధాలుగా/ భావాంతరాల ఉద్వేగాలను సిరాగా మార్చి ఆవిష్కరించే

## 'అంతర్లీన' భావాలే కవితలుగా..



'అంతర్నిషిత నేత్రం'గా తన కవితల్ని అభివర్ణిస్తున్నారు. 'అలసైతం ఆమె ఓపికకి/ తలవంచి నమస్కరిస్తుంది' ఎవరా అలుపెరుగని అల?' ప్రేమను రంగరించి/ పొందికను సింగారించి/ ఒద్దికగా సంసారనావ నడిపే నావిక ఆమె' యిలా స్త్రీశక్తి సౌందర్యాన్ని వర్ణిస్తూ చాలా కవితలే రాశారు. 'ఎందరో అనామకుల్ని/ కలం పట్టించి..కవనాలు రాయిస్తోంది' ఎవరది? యింకెవరూ..అయస్కాంతంలా ఆకర్షించే శాలువా! మనసుల్ని పెనవేసుకునే బంధాలన్నా, మనుషుల మధ్య సంబంధాలన్నా కవయిత్రికి అపార గౌరవం కలకాలం నిలుపుకోవాల్సినవని ఆమె నిశ్చితాభిప్రాయం. 'బాధల్ని మరిపించే బంధాల చేరువలేకుంటే అంతా దైన్యమేగా' అంటూ వాపోతారు. కాలాన్ని వర్ణిస్తూ తాత్వికత చిప్పిల్లే కవితల్ని అందించారు. ఎన్నో జ్ఞాపకాలు, స్మృతులు, భావకవితల్లోకి ఒంపి మనకు అందించారు. కవితలన్నీ చదివింతర్వాత యిది అద్దగూరి శ్రీలక్ష్మి తొలి ప్రయత్నంలా తోచదు. మీరు చదవండి..అదే అనుభూతి కలుగుతుంది. **(అంతర్లీన, రచన: అద్దగూరి శ్రీలక్ష్మి, వెల: రూ 100, ప్రతులకు: ఇ.నం.3-212/1, హైవేరోడ్, ఎంసిసి, మంచిర్యాల)**

**- రమణ వెలమకన్ని**



# శిశు సంరక్షణ మన బాధ్యత

**పిల్లలు** ప్రపంచంలోనే అత్యంత విలువైన వనరు. కానీ మాతృ గర్భంలో నుంచి పేగుబంధంతో బయటకు వచ్చే చిన్నారి.. ఆ పేగుతడి ఆరకముందే ఆ తల్లి కళ్లల్లో కన్నీరు నింపి ఈ లోకం నుండి వెళ్లిపోతున్నారంటే ఆ బాధ భరించలేనిది. మన దేశంలో ఏటా లక్షల సంఖ్యలో చిన్నారులు అమ్మ ఒడి నుండి బయటకు రాకముందే ప్రాణాలు కోల్పోతున్నారు. అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరికరాలు, అద్భుత వైద్య పరిజ్ఞానం, మేధో సంపత్తి కలిగిన వైద్య బృందం అందు బాటులోకి వచ్చినా తల్లీ, బిడ్డల మరణాలు సంభవించడం చాలా బాధాకరం.

**కాళంరాజు వేణుగోపాల్**

శిశు రక్షణ దినోత్సవాన్ని నవంబరు 7న పాటిస్తారు. శిశువుల భద్రత గురించి అవగాహన కల్పించడం, శిశువులను సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వారి ప్రాణాలను రక్షించడం ఈరోజు లక్ష్యం. సరైన భద్రత, సరైన సంరక్షణ లేకపోవడం వల్ల, నవజాత శిశువులు చాలా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని గుర్తుంచుకోవాలి. నవజాత శిశువులు మరణించడంపై అవగాహన పెంపొందించడం కోసం శిశు సంరక్షణ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ముఖ్య ఉద్దేశం శిశువుల భద్రత గురించి అందరిలో అవగాహన కల్పించడం, శిశువుల పట్ల సరైన శ్రద్ధ వహించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడడం.

ప్రపంచ వ్యాప్తంగా నవజాత శిశువులకు సరైన సంరక్షణ లేకపోవడం వల్ల అనేకమంది పిల్లలు మరణిస్తున్నారు. భారతదేశంలో శిశు మరణాల రేటు అనేక దేశాల కంటే ఎక్కువ ఉండడం కొంత ఆందోళనకరం.

ప్రపంచంలో నవజాత శిశు మరణాల్లో మన దేశం నాలుగో స్థానంలో ఉంది. అందుకు ప్రధాన కారణం పేదరికం, అవిద్య, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాల కారణంగా తల్లి సరిగా పోషకాహారం తీసుకోకపోవడం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల అధిక రక్తపోటు, రక్తహీనత, గర్భధారణ సమయంలో జాగ్రత్తల్ని పాటించకపోవడం వంటివి. కొంత డాక్టర్ల నిర్లక్ష్యం, కొన్ని చోట్ల వైద్య బృందం అలసత్వం, రోజురోజుకీ పెరుగుతున్న అధిక జనాభా, ప్రాథమిక ఆరోగ్య సేవలు సరిగా లేకపోవడం ఉన్నా పట్టించుకోకపోవడం, గ్రామీణ ప్రజలకు అవగాహన లేకపోవడం వలన శిశు మరణాలు ఆశించిన స్థాయిలో తగ్గలేదు. అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం, ఆసుపత్రికి చేరలేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ పొందినవారు లేకపోవడం.. ఇంకా ఎన్నో సమస్యలు తలెత్తడం వంటి కారణాలతో చిన్నారులు పలుమార్లు ప్రాణాలు వదులుతున్నారు.

మన దేశంలో ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల తల్లి అయ్యేందుకు తగిన శరీర సౌష్టవం లేకపోవడం నవజాతి శిశువుల మరణాలకు దారితీస్తోంది.


శారీరకంగా, మానసికంగా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకుండానే పుష్పవతి అవగానే వారికి పెళ్లి జరిపిస్తున్నారు. ఆడపిల్లలు యుక్తవయసుకి వచ్చిన నాటినుంచి వారికి తగిన పోషక విలువలున్న ఆహారం అందేలా చూడాలి. శారీరకంగా, మానసికంగా ఎదిగిన తర్వాత వివాహాన్ని జరిపించాలి. అలా చేయాలంటే– ప్రధానంగా ఆడపిల్ల వివాహ వయసుకు సంబంధించిన విషయాల పట్ల తల్లి దండ్రులకు అవగాహన ఎంతో అవసరం. కానీ నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు ఎక్కువగా ఉండడం వల్ల కూడా శిశు మరణాలు ఎక్కువ సంభవిస్తున్నాయి. అదీకాక మన దేశంలో గ్రామీణ ప్రాంతాల్లోని ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే భూత వైద్యుల వద్దకు వెళతారు. శాస్త్రీయతే లేని ఆ భూత వైద్యులు చెప్పినవన్నీ తప్పకుండా పాటిస్తారు. కొన్ని చోట్ల వారిని నమ్మినట్లుగా వైద్యుల్ని కూడా నమ్మరు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వాటికి తాయెత్తుల్ని కట్టించుకుంటారే తప్ప ఆసుపత్రికి వెళ్లేందుకు ఇష్టపడరు. మాతృత్వ సమయంలో శరీరంలో వచ్చే మార్పుల పట్ల పూర్తి అవగాహన లేకపోవడం వల్ల, కాన్పు సమయంలో బిడ్డకు, తల్లికి ఎటువంటి

సమస్యలున్నా ఆదిలో గుర్తించలేరు. ఈ అంశాల్ని శాస్త్రీయంగా తెలుసుకోక పోవడం వల్ల చివరకు తల్లీ, బిడ్డ ప్రాణాల మీదకు వస్తుంది. కాబట్టి మూఢనమ్మకాల్ని పాటించేవారిని సరైన మార్గంలో వెళ్లేలా అవగాహనపర్చాలి





**ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీలు-ప్రభుత్వ ఆస్పత్రుల సమస్యలు**

ఇంకో పక్క నెలలు నిండిన గర్భిణీల కడుపుకోతలు ఆగడం లేదు. సహజంగా జరగాల్సిన కాన్పు కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్న వైనం నిత్యం వెలుగు చూస్తున్నాయి. ఇలా ప్రసవ వేదనను మించిన ఆర్థిక భారంతో పేదలు ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీ చేయించుకోలేని పరిస్థితి ఏర్పడింది. రోజుకు పది వరకైనా కడుపులు కోసి ఆర్థికంగా కూడబెట్టుకోవాలనే తాపత్రయం కొన్ని ఆస్పత్రులదైతే, మరికొన్ని ఆస్పత్రులు సాధారణ ప్రసవాల పేరుతో దండుకుంటున్నాయి. పోనీ ప్రభుత్వ ఆస్పత్రులకు వెళదామంటే అలవిమాలిన నిర్లక్ష్యం తాండవిస్తూ అన్నిటికి కొరతై నిర్లక్ష్యాలకు నిలయంగా మారుతున్నాయి. కొందరు సిబ్బంది అలసత్వం సైతం గర్భిణుల, శిశువుల ప్రాణాల మీదకు తెస్తుంది. ప్రసవ సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన వైద్యులు కాలక్షేపం చేస్తూ తల్లీబిడ్డల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



శిశు మరణాలను నివారించడానికి ప్రభుత్వం సమర్థవంతమైన విధానాన్ని ప్రకటించింది. కానీ ఆచరణలోకి వచ్చేసరికి డొల్లతనం కనబడుతుంది. అవసరమైన ఆరోగ్య సంరక్షణ లేకపోవడం, పల్లెటూరి జనాలతో సరైన ఆలోచన లేకపోవడం, పెరుగుతున్న జనాభా భారం, వైద్య సదుపాయాల లేమి కారణంగా శిశు మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని అంచనా. నవజాత శిశువులకు సహాయం చేయడానికి భారత ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. వాటిని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి పల్లెటూళ్లలో, ఏజెన్సీ తదితర ప్రదేశాలకు తీసుకెళ్లి ఆరోగ్య రక్షణ చర్యలు ప్రారంభించాలి. జనాభాకు తగ్గట్టు వైద్య సదుపాయాలను మెరుగుపరిచి, కావలసిన సిబ్బందిని, వసతులను సమకూర్చి ప్రసవానికి ముందు, తర్వాత కూడా తల్లికీ, బిడ్డకీ కూడా పౌష్ఠికాహారం అందేలా చర్యలు చేపట్టి వారి రక్షణ చూసుకునేలా చట్టాలు చేయాలి. ఎక్కువ ప్రసవాలు చేసి తల్లీ బిడ్డలను క్షేమంగా చూసుకున్న సిబ్బందికి ప్రత్యేక బహుమతులు, ఇన్సెంటివ్స్ ఇవ్వడం ద్వారా వారిని ప్రోత్సహించాలి. అదే సమయంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి తగిన దండన విధించడం ద్వారా వ్యవస్థలో మార్పును తీసుకురావచ్చు. శిశువులు రేపటి పౌరులు, వారు ప్రపంచ భవిష్యత్తు కాబట్టి వారు రక్షించబడాలి. ఆ దిశగా మన ప్రయత్నం విజయం సాధించాలి. ❑







కథ

# నిజాయితీతో మెలగాలి

భీమయ్య నిత్యావసర వస్తువులు కొనడానికని సంతకు బయలుదేరాడు. కొద్ది దూరం వెళ్లగానే ఈదురుగాలి రావడంతో కళ్లలో దుమ్ము పడిందని కళ్లు నలుపుకొంటుండగా చేతినుంచి జారిపోయి దూరంగా పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న చంద్రయ్య కింద పడ్డ సంచిని తీసి చూశాడు. అందులో రెండు వంద రూపాయల నోట్లు కనిపించాయి. అతనిలో దుర్బుద్ధి పుట్టింది. దాంతో ఒక వంద నోటు తీసుకుని దాచి "అయ్యా! ఇదిగో మీ సంచి" అని భీమయ్య చేతికి ఇచ్చి విసవిసా వెళ్లిపోయాడు చంద్రయ్య.

భీమయ్య ఈదురుగాలి తగ్గాక సంతకు చేరుకుని రెండు వందలకు సరిపడా సరుకులు తీసుకుని చేతి సంచిలో డబ్బుకోసం చూస్తే వందనోటు మాత్రమే కనిపించింది. ఒక నోటు దారిలో పడిపోయి ఉంటుందనుకొని కొన్ని సరుకులు తిరిగి ఇచ్చి వంద రూపాయలకు సరిపడా సరుకులు మాత్రమే తీసుకుని ఇంటిదారి పట్టాడు.

చంద్రయ్య ఇంటివద్దకు చేరుకుని కిటికీ వద్ద నిలబడ్డాడు. లోపల భార్య, కొడుకుల మాటలు వినసాగాడు. "అమ్మా, ఈ రోజు బడిలో మా తరగది గది వద్ద నాకు బంగారు గొలుసు దొరికింది. దానిని మా ప్రధానోపాధ్యాయుల వారికి ఇచ్చాను. తరువాత తెలుగుపాఠం చెప్పే ఉపాధ్యాయుడు రాఘవగారు "రవీ! నీకు దొరికిన ఆ గొలుసు, తరగతులు చిమ్మే కాంతమ్మది. దానిని నిజాయితీతో ప్రధానోపాధ్యాయులవారికి ఇవ్వడం గొప్ప విషయం. ఇందుకు నిన్ను అభినందిస్తున్నాను" అని నాకు పెన్ను బహుమతిగా ఇచ్చారు. తరగతిలో అందరూ చప్పట్లతో నన్ను అభినందించారు. కాంతమ్మగారు కూడా నాకు కృతజ్ఞతలు చెప్పారు" అని తల్లికి పెన్ను చూపించాడు.

సీతమ్మ రవిని అక్కున చేర్చుకుని "నేను, నాన్న నీకు చెప్పే మంచి మాటలు వింటున్నావు కాబట్టి నీలో కూడా మంచి పనులు చేయాలనే ఆసక్తి ఏర్పడింది" అని అంది సీతమ్మ. "అమ్మా! రేపు నా పుట్టినరోజు కదా! నాన్న నాకు మిఠాయిలు, బొమ్మలు తెస్తారా?" అన్నాడు రవి.

"అవును బాబూ.. ఈరోజు మీ నాన్న మరింత కూలిపని చేసి కాస్త ఎక్కువ డబ్బు సంపాదించి వాటితో నీకు మిఠాయిలు" తెస్తారు" అంది సీతమ్మ.

ఐదవ తరగతి చదివే రవి చిన్న వయసులోనే నిజాయితీతో మెలగడంతో పాటు, భార్య చెప్పిన మాటలు విన్న చంద్రయ్య కళ్లు చెమర్చాయి. వెంటనే భీమయ్య కోసం పరుగు తీసాడు. దారిలో అతను ఎదురు పడ్డాడు. "అయ్యా! నన్ను క్షమించండి. ఎప్పుడూ నేను తప్పు చేయలేదు. ఈరోజు నాకు కూలి దొరకక మీ సంచిలో నుండి వంద రూపాయలు దొంగిలించాను" అని వంద నోటు తిరిగి ఇచ్చాడు చంద్రయ్య. "పరవాలేదు.. నీకు ఎంతో అవసరమయ్యే ఆ పని చేసావు. నాకు గుర్రపు బండి ఉంది. ఈ మధ్య నాకు చూపు సరిగ్గా ఆనడం లేదు. దాంతో బండి తోలడం లేదు. నీవు నడిపిస్తాను అంటే ఆ బండిని నీకిస్తాను. నీవు సంపాదించినదాంట్లో చెరిసగం తీసుకుందాం" అన్నాడు భీమయ్య.

"అలాగే అయ్యా! బండి తీసుకుంటాను. కానీ వచ్చిన సొమ్ములో మీకు అరవై శాతం ఇవ్వడం ధర్మం. ఎందుకంటే బండి మీది, పైగా గుర్రానికి దాణాఖర్చు కూడా ఉంటుంది" అన్నాడు చంద్రయ్య.


"అలాగే. రేపటి నుండి బండి తీసుకెళ్లు. అంతవరకు ఈ వంద కూడా ఉంచు. దీని లెక్క రేపు చూసుకుందాం" అన్నాడు భీమయ్య.

చంద్రయ్య సంతకు వెళ్లి కొన్ని మిఠాయిలు, ఒక ఆటబొమ్మ కొని సంతోషంగా ఇల్లు చేరుకున్నాడు. రవి బడిలో జరిగిన సంఘటన నాన్నకు కూడా చెప్పాడు. చంద్రయ్య ఇంతకుముందు విననట్టు "మా బాబు బంగారం.. ఇదే విధంగా మంచి బాటలో నడవాలి" అని మిఠాయిలు, బొమ్మ రవికి ఇచ్చాడు.

రవి సంతోషంగా తీసుకున్నాడు.

**- యు.విజయశేఖర రెడ్డి**






వార్త ఆదివారం

## బాలగేయం

### మా బడి



అందమైన మా బడి
మా బడిలో వుంది
చదువుల సిరి
చదువులపైనే మా గురి
గురువులే మా దేవుళ్లు
ఆట లెన్నో ఆడుకుంటాం
అల్లరి బాగా చేస్తాం
కాని పాఠాలు
బాగా వింటాం
హోంవర్కు కూడా చేస్తాం
పరీక్షలు బాగా రాస్తాం
మంచి మార్కులతో
పాసైతాం అమ్మానాన్నల
ఆశయాలు నెరవేరుస్తాం
గురుదేవుల గౌరవాన్ని
నిలబెడతాం
ఉన్నత స్థాయికి
ఎదిగేస్తాం
మా బడి గొప్పదనాన్ని
చాటిస్తాం

**- సి.జయచంద్రారెడ్డి**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**


**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.మహిధర్,** మంథని

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'బ్యాండ్ ఎయిడ్' ఏ విధంగా పుట్టింది?

**జవాబు:** మహిధర్! దీనిని ప్రాథమికంగా 1921లో ఎర్లే డిక్సన్ రూపొందించారు. డిక్సన్‌కు తన భార్య జోసఫైన్ అంటే చాలా ఇష్టం. అతను ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి ఆమె రుచికరమైన వంటలు సిద్ధం చేసి పెట్టేది. కానీ కూరగాయలు తరిగేటప్పుడు ఆమె చేతికి గాయాలు అవుతుండేవి. ఆమె కట్టుకునే బ్యాండేజీని చూసి డిక్సన్ తెగ బాధపడిపోతుండేవారు. తన భార్య ఆ బ్యాండేజీని విప్పడం, మళ్లీ వంట చేయడానికి కష్టపడడం వంటివి చూడలేకపోయారు. ఏం చేస్తే బావుంటుందోనని ఆలోచించి ఒకరోజు శుభ్రం చేసిన బ్యాండేజీని తీసుకుని, దానిని ఆపరేషన్ల సమయంలో ఉపయోగించే టేపు మధ్యలో ఉండేలా అమర్చి, జోసెఫైన్ చేతికి అతికించారు. అది కాస్తా చేతికి అంటుకొని చిన్న చిన్న పనులు చేస్తున్నా పడిపోకుండా ఉండడంతో ఇదేదో బాగానే ఉందే అనుకున్నారు డిక్సన్. అతని భార్య కూడా చాలా సంతోషించింది. అలా పుట్టిందే మొట్టమొదటి 'బ్యాండ్ ఎయిడ్'..



డిక్సన్ అప్పట్లో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీలో పని చేసేవారు. తాను తయారు చేసిన బ్యాండ్ ఎయిడ్ సంగతి ఆ నోటా ఈ నోటా కంపెనీ దాకా పాకింది. ఆ కంపెనీవారు బ్యాండ్ ఎయిడ్ గురించి తెలుసుకొని తయారు చేసి అమ్మడం మొదలు పెట్టారు. 1924 నుంచి యంత్రాల మీద తయారు చేయడం మొదలెట్టారు. దాంతో డిక్సన్ దశ కూడా తిరిగింది. ఆ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. రిటైర్ అయ్యేవరకు ఆయన ఆ పదవిలోనే ఉన్నారు.

ఇప్పుడంతా స్మార్ట్ యుగం నడుస్తోంది. స్మార్ట్‌ఫోన్ల నుంచి పళ్లు తోమే బ్రష్ వరకూ అన్నీ స్మార్ట్‌గా మారిపోతున్నాయి. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వస్తువుల పనితీరు సైతం మారిపోతోంది. “మనుషులకు సంబంధించినవన్నీ స్మార్ట్‌గా మారుతుంటే మొక్కలకు ఎందుకు మారకూడదు..” అనుకున్నారేమో!
అందుకే లెట్‌పాట్ అనే ఓ సంస్థ కుండీలను సైతం స్మార్ట్‌గా మార్చేసాయి. ‘ఎల్‌పీహెచ్‌మ్యాక్స్’ పేరుతో రూపొందించిన ఈ స్మార్ట్ పూలకుండీ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



# మొక్కలకు స్మార్ట్ కుండీ!

ఇందులో ఉన్న ఫీచర్లు ఔరా! అనిపించేలా ఉన్నాయి.

## స్పెషల్ ఫీచర్స్

ఈ పూల కుండీని ఇంట్లోనే ఏర్పాటు చేసుకోవచ్చు. సూర్యకాంతి ఉండదు కదా అని సందేహించకండి.







సూర్యకాంతి అవసరమైన సమయంలో దీనిపై ఉన్న రూఫ్‌లో అమర్చిన ఎల్ఈడీ లైట్లు వెలుగుతాయి. ఇదే సూర్యకాంతిలా ఉపయోగపడుతుంది. ఫుల్ ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ కుండీలో ఒకేసారి ఏకంగా ఇరవై ఒక్క మొక్కలను పెంచుకునే అవకాశం ఉంటుంది.
ఈ కుండీలో మట్టి వేయాల్సిన అవసరం లేదు. కేవలం నీటితోనే మొక్కలు పెరుగుతాయి. అవసరమైనప్పుడల్లా దానంతటదే అదే నీటిని తీసుకుంటుంది. ఇక ఈ కుండీని స్మార్ట్‌ఫోన్ సహాయంతో ఆపరేట్ చెయ్యొచ్చు. మొక్కలు ఎలా వున్నాయి, నీరు ఎంత ఉంది.. లాంటి వివరాలను ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చు. పూల మొక్కలు, ఆకుకూరలు లాంటి మొక్కలను పెంచుకోవచ్చు.
ఈ కుండీకి ముందు ఒక ఎల్‌సీడీ ప్యానెల్ ఉంటుంది. దాని ద్వారా కుండీలో నీళ్లు ఎన్ని వున్నాయనే విషయం తెలుసుకోవచ్చు.









# 'బంగారమే' ప్రసాదంగా పంచే దేవాలయం

ఏ ఆలయంలోనైనా శొండెలు, చక్కెరపొంగలి, పులిహోర, పాయసం.. ఇలా వివిధ రకాల ప్రసాదాలు పెట్టడం చూస్తుంటాం. వీటికి భిన్నంగా బంగారాన్నే ప్రసాదంగా ఇచ్చే దేవాలయం మధ్యప్రదేశ్‌లో ఉంది. ఇది నిజమేనా? అని సందేహించండి.. అక్షరాల నిజం.

మధ్యప్రదేశ్‌లోని రాత్లాంలో వజ్ర వైఢూర్యాలతో పూజలందుకుంటోంది మహాలక్ష్మి అమ్మవారు. కొన్ని వందల ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయం ఇది. అప్పట్లో రాజు తాము సంపాదించుకున్న సంపదను ఈ అమ్మవారికి నివేదించేవారట. ఆ విధంగా చేయడం వల్ల ఆ ధనం రెట్టింపవుతుందని వారి విశ్వాసం. అందువల్ల అప్పటి నుంచి అక్కడ భక్తులు అమ్మవారికి పాయసం, చక్కెరపొంగలి, రవ్వకేసరి, పులిహోర వంటి ప్రసాదాలకు బదులుగా డబ్బునీ, బంగారాన్నీ నైవేద్యంగా సమర్పిస్తున్నారట.



**అలంకారమూ డబ్బుతోనే!**

ప్రతి రోజూ భక్తులకు దర్శనమిస్తూ సంవత్సరం పొడవునా పూజలందుకునే రాత్లాం మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు మొక్కుల కింద కోట్లాది రూపాయల నగదు, బంగారం, వెండినాణేలు, నగలు సమర్పించుకుంటారు. అందువల్ల ఆ దేవాలయం కుబేర నిధిగా ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ పండుగలు, ప్రత్యేక రోజులు, దీపావళి సమయంలో అమ్మవారినీ, ప్రాంగణాన్ని పూలతో కాకుండా డబ్బు, బంగారు ఆభరణాలు, వజ్రవైఢ్యూర్యాలతో అలంకరిస్తారు.



అలంకరణ కోసం అమ్మవారికి కానుకలుగా అందిన వాటితో పాటు భక్తుల నుంచి డబ్బు, నగలు స్వీకరిస్తారు. ఆ సమయంలో ఆలయం ట్రస్టు సభ్యులు.. నగలు ఇచ్చినవారి వివరాలు రాసుకొని, వారి చేత సంతకం పెట్టించుకుని టోకెన్ ఇస్తారు. ఆయలంలో ప్రత్యేక కార్యక్రమాలు అయ్యాక టోకెన్ల ఆధారంగా వారికి తిరిగి అందజేస్తారు.

మరో ఆసక్తికర విషయం ఏమిటంటే– దీపావళి, ధన త్రయోదశి సమయంలో అమ్మవారికి డబ్బు, బంగారం సమర్పించిన భక్తులు అక్కడికి దర్శనానికి వచ్చిన వారికి బంగారం, వెండి నాణేలను ప్రసాదంగా పంచుతుంటారు. అలా పంచడం వల్ల కూడా సిరిసంపదలు వర్ధిలుతాయని వారి నమ్మకం. అందుకే అక్కడ బంగారు నాణేలు గ్రాము కంటే తక్కువ బరువులో వివిధ పరిమాణాల్లో దొరుకుతాయి. ఎవరి స్థోమతకు తగ్గట్టు వారు వాటిని కొనుగోలు చేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టి, తరువాత పంచుతారు.

**ఎలా వెళ్లాలి?**

ఇండోర్ ఎయిర్ పోర్టుకు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది ఆలయం. అక్కడి నుండి రాత్లాం వరకు బస్సులో చేరుకోవచ్చు; రైలు మార్గంలో వెళ్లేవారు ఉజ్జయిని స్టేషన్లో దిగి, అక్కడి నుండి ఆలయానికి బస్సు/ప్రయివేటు వాహనాల్లో వెళ్లవచ్చు. ❍

**కథ**

**ముకుందరావు ఆఫీసులో కూర్చుని ఒక్కొక్క ఫైల్ పరిశీలిస్తున్నాడు. ఈ రోజు చెకింగ్ ఆఫీసర్స్ వస్తున్నారని నిన్ననే మేనేజర్ ప్రతాప్ అనౌన్స్ చేసారు.**

# ఇల్లాలి కోరిక

నరెద్దుల రాజారెడ్డి

ఫైల్స్ మొత్తం వెరిఫికేషన్ చేయడంలో పూర్తిగా నిమగ్నమైనాడు. అప్పుడప్పుడు ఎదురుగా గోడకు వేలాడదీసిన గడియారం వైపు తన చూపుల్ని సారిస్తూ పనిలో మునకలేస్తున్నాడు.

మేనేజర్ ఒక్కో కౌంటర్‌ని చూస్తూ ముకుందురావు దగ్గరకు చేరుకున్నాడు.. "మీ పని ఎంతవరకు వచ్చింది?" అనడిగాడు మేనేజర్ ప్రతాప్.

"ఇంకా మూడు ఫైల్స్ మిగులున్నాయి సార్, పూర్తి చేస్తాను" అంటూ సమాధానం ఇచ్చాడు ముకుందరావు.

"మీరు డ్యూటీలో జాయిన్ అయిన మొదట్లో చాలా చురుగ్గా పని చేసేవారు.. రాను రాను మీలో ఏదో తెలియని మార్పు కనిపిస్తోంది, ఏమైంది ముకుందరావుగారు" అంటూ సవినయంగానే అడిగాడు ప్రతాప్.

"అబ్బే ఏం లేదు సార్" అంటూ సమాధానం దాటేసే ప్రయత్నం చేసాడు ముకుందరావు.

"లేదండీ.. మీరు ఏదో దాస్తున్నారు. కొన్ని సమస్యలు చెప్పుకుంటే తీరుతాయంటారు పర్లేదు చెప్పండి" అన్నాడు ఆఫీసర్.

ముకుందరావు మౌనం వహించేపాటికి "సరే పని పూర్తి చేయండి" అంటూ అలా కదిలాడో లేదో చెకింగ్ ఆఫీసర్స్ వెనుకనే వచ్చేసారు. సీదా ముకుందరావు టేబుల్ దగ్గరకు వచ్చి ఫైల్ పరిశీలించారు.


"పనిలో ఇంత నిర్లక్ష్యం పనికిరాదు పోయిన నెలలో పూర్తి కావాల్సిన వర్క్ ఇప్పటివరక్కూడా పెండింగ్‌లో వుంచారంటే అర్ధమేంటి?" అని నిలదీసాడు ఆఫీసర్.

ముకుందరావులో చలనం లేదు.

"మీకు జీతాలు దండగ, నీకు మూడు రోజులు టైం ఇస్తున్నాను. ఆలోగా పూర్తి చేసి పెట్టండి" అంటూ చేతిలో వున్న ఫైల్ విసురుగా టేబుల్‌పై పడేసి వెళ్లిపోయాడు, ఆఫీసర్.

"మనశ్శాంతి లేని డబ్బు ఎంత సంపాదిస్తే మాత్రం ప్రయోజనమేంటి?" ఇది తన మనసులోని మాట.. దిగమింగుకున్నాడు

ముకుందరావు సాయంత్రం వరకు ఫైల్స్‌తో పెనుగులాడితే ఒక్కటి మాత్రమే క్లియర్ చేయగలిగాడు.



ఆరింటికి ఇంటికి చేరుకున్నాడు ఎక్కడ సామాన్లు అక్కడే వున్నాయి. వసారాలో పేపర్ చదువుతూ కూర్చుంది నళిని.

మార్నింగ్ తను డ్యూటీకి వెళ్ళినప్పుడు ఎలా వుందో ఇప్పుడు కూడా అలానే వుంది.. ఏమాత్రం మార్పు కనిపించలేదు.

"నళినీ! మార్నింగ్ టిఫిన్ చేయలేదా?" తిన్నగా భార్యను అడిగాడు ముకుందరావు.

"బోలెడు శక్తి వుంది, వండుకుని తినొచ్చుగా. నేనేమైనా పనిమనిషిలా కనిపిస్తున్నానా" కోపంగా అంది నళిని.

"అంత మాటెందుకు? నువ్వు ఈ ఇంటి ఇల్లాలువి. బరువు బాధ్యత అంతా సమానంగా మోయాల్సిన దానిని ఇలా ఏవేవో ఊహించుకుంటే ఎలా చెప్పు?" అంటూ నెమ్మదిగా దండించాడు ముకుందరావు.

"నావి కూడా ప్రాణాలే పొద్దస్తమానం పని చేసుకుంటూ పోతే ఆరోగ్యం ఏంగాను" అంది కసురుగా నళిని.

తనకు కోపం వస్తే పగలంతా నీతులు చెప్పిన తనకు బూతుల్లాగే వినిపిస్తాయని మారు మాట్లాడకుండా హాల్లోకి నడిచాడు ముకుందరావు.

పిల్లలు ఆడుకుంటున్నారు.. తన తల్లి వెంకటలక్ష్మి చైర్‌లో కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయింది.

తన తండ్రి హఠాత్తుగా చనిపోగానే సంసార బాధ్యత వెంకటలక్ష్మిపై పడింది. కూలి చేసి ముకుందరావుని చదివించింది. యుక్త వయసులోనే పెళ్లి చేస్తే తనకు తోడు దొరికినట్టు వుంటుంది నాకు నీడ దొరికినట్టు వుంటుందనే నెపంతో ఏరికోరి తన చుట్టరికంలోనే సంబంధం ఖాయం చేసుకుని నళినిని తన కొడుక్కి చేసుకుంది.

పెళ్ళయిన కొన్ని నెలల్లోనే ఒక ప్రైవేటు సంస్థలో ముకుందరావుకి ఉద్యోగం దొరికింది. కొన్నాళ్లు సజావుగా సాగిన సంసారంలో రానురాను పెను మార్పులు చోటు చేసుకున్నాయి.

.....

ఇదిలా వుండగా రాత్రి పడుకునే ముందు పగలు జరిగిన సన్నివేశాన్ని ఒక్కొక్కటి చెప్తూనే కొన్ని కల్పించుకుని మరీ భర్తపై రుద్దడం మొదలుపెట్టింది నళిని.

"మీ అమ్మగారికి చాదస్తం ఎక్కువ, ఏమి చెప్పినా వినదు" అంది నళిని.

"వయసు మీద పడింది కదా ఈ వయసులో అలాగే వుంటారు, మనమే సర్దుకుని పోవాలి" అన్నాడు ముకుందరావు.

"ఎన్నాళ్లని సర్దుకుపోవాలి. అయినా మీరు ఆఫీసుకు వెళ్లిన తర్వాత ఇంటిపని, వంటపని అంతా నేనే చూసుకోవాలి. పైగా పిల్లల్ని ఆడించాలి.. నా వలన కావడం లేదు" అంది నళిని.

"మన పని మనం చేసుకోవడంతో తప్పేముంది" అన్నాడు ముకుందరావు.

"ఆ.. అంటారంటారు.. మీకేం తెలుస్తుంది 'మోసేవాళ్లకే తెలుస్తుంది కావడి బరువు' అన్నట్టు అందరూ సర్దుకుని తలాకోపని చేస్తేగాని తెల్లారదు" చిరు కోపంతో బుకాయించింది నళిని.

"ఇంట్లో ఎవరుంటారు.. అమ్మకు వయసైపోయింది, నేను ఆఫీసుకు వెళతాను. పనులు చూసుకోవాల్సింది నువ్వేగా. పనిమనిషిని పెట్టుకుందామంటే వద్దంటావు మరి.. ఎలా చెప్పు" అన్నాడు ముకుందరావు.

"అవన్నీ కాదండీ! నేను మిమ్మల్ని ఒకటి కోరతాను, నా కోరిక తీరుస్తారా లేదా చెప్పండి అంతే!" అంటూ చప్పున మాట మార్చేసింది నళిని.

"ఏంటో చెప్పు. చేతనైతే తీరుస్తాను" అన్నాడు ముకుందరావు.

"మాటిచ్చినాక చేతకాకపోయిన కష్టపడి తీర్చాల్సిందే" అంది నళిని.


"అలాగే కానీ" అనగానే కాస్త దగ్గరగా జరిగి ముకుందరావు చేయిని తన చేతిలో కలుపుకుని మరో చేతిని తన తలపై పెట్టించుకుని గట్టిగా మాట తీసుకుంది నళిని.

భార్య తనకేమి కావాలని కోరుకుంటుందో అర్థంగాక తల గీరుకున్నాడు.

చెవిలో చిన్నగా చెప్పేసరికి ముకుందరావు ముఖంలో విచారపు నీడ కమ్మేసింది "ఇది చాలా తప్పు నళినీ! కోరికంటే నలుగురికి ఉపయోకమైందన్నా వుండాలి లేదా నిస్వార్థంతో కూడుకున్నదైనా వుండాలి. నువ్వు చదివిన చదువుకు నువ్వు కోరిన కోరికకు అర్థముందా? ఇదేనా నువ్వు అర్థం చేసుకున్నది" అంటూ అసహనం వ్యక్తపరిచాడు ముకుందరావు లోలోపల ఆవేశాన్ని అణుచుకుని "వయసు మళ్లిన వృద్ధులు పిల్లలతో సమానం, వాళ్ల మారాం చేస్తారు మనం నచ్చజెప్పాలి, దగ్గరుండి అన్నీ చూసుకోవాలి. సపర్యలు చేయాలి. అంతేగానీ భారమనుకుంటే ఎలా చెప్పు? మన చిన్నతనంలో వాళ్ల కూడా ఇలా అనుకుని వుండి వుంటే మనం ఇంతవాళ్లం కాలేం కదా, కొంచెం ఆలోచించు" అంటూ నచ్చచెప్పాడు ముకుందరావు.

"మిమ్మల్ని హితోపదేశం చేయమనలేదు. నాపై ఒట్టు వేసారు. మాట తప్పుతున్నారు అంటే నా కన్నా మీ అమ్మే ఎక్కువైందా?" అంటూ తిరకాసులో పెట్టేసింది నళిని.

"అలా కాదు.. నిన్ను ఎంత బాగా చూసుకుంది మా అమ్మ 'నా కోడలు బంగారమంటూ' ఊరంతా చాటింపు వేసింది. నిన్ను కాలు కింద పెట్టనివ్వకుండా కూతురు లెక్కన చూసుకుంది. ఇప్పుడామెకు వయసు పెరిగి శరీరం సహకరించడం లేదు. ఆ మాత్రానికే బరువనుకుంటే ఎలాగయినా పనిలో అప్పుడప్పుడు సహాయపడుతోం దిగా" అన్నాడు ముకుందరావు.



"ఓహో! అయితే నా కోరికను చంపేస్తున్నారన్న మాట. నేనంటే అంత చులకనగా వుందా మీకు. సరే మీకెందుకు భారం, నేను మా పుట్టింటికి వెళ్లిపోతాను" అంటూ అడ్డం తిరిగింది నళిని.

....

దిక్కు తోచని పరిస్థితిలో తల పట్టుకుని కూర్చున్నాడు ముకుందరావు. ఏ ఇల్లాలైనా ఇల్లు పచ్చగా వుండాలని కోరుకుంటుంది. అందరూ బాగుండాలని ముక్కుకుంటుంది. నళిని మాత్రం అందుకు భిన్నంగా తనకు స్వేచ్ఛ కావా లని కోరుకుంటోంది. తను చెప్పిం దే జరగాలని శాసిస్తోంది. కోరిక తీర్చకపోతే పుట్టింటికి వెళ్లిపోయి ఇంటిపరువు తీస్తానని బెదిరిస్తోంది. ఆ రాత్రి ముకుందరావుకు నిద్ర పట్టలేదు.

తెల్లవార్లూ మేలుకున్నాడు. ఉదయం నళిని లేచి పెరట్లోకి నడిచింది. పిల్లలు అప్పటికే లేచి గోల చేస్తున్నారు.

"అబ్బబ్బా.. వంటపని, పిల్లల పని చూడలేక చస్తుంటే మళ్లీ ఈ ఖర్మ ఒకటి నాకు తగులుకుంది. స్నానం చేయించాలి, అన్నం తెచ్చి దగ్గర పెట్టాలి. తుమ్మినా భయపడాలి, దగ్గినా పలకరించాలి, నేను వేగలేను" అంటూ పెరట్లో చెట్లకు నీళ్లు పడుతున్న నళిని మాటలు విన్నాడు ముకుందరావు.

ఇవన్నీ తన తల్లి వెంకటలక్ష్మిని ఉద్దేశించి అంటున్నవని మనసు గట్టి చేసుకుని ఆమె బట్టలన్నీ బ్యాగ్‌లో సర్దిపెట్టాడు..

"అమ్మా! బయలుదేరు వెళ్దాం" అన్నాడు. వెంకటలక్ష్మి మారు మాట్లాడలేదు. బయలుదేరి గుమ్మంలోకి వచ్చి నిలబడింది.

బ్యాగ్ తెచ్చి కారులో పెట్టాడు. వెంకటలక్ష్మి ముందు సీట్లో కొడుకు పక్కన కూర్చుంది.

"అమ్మా! అవ్వ ఎక్కడికి వెళుతోంది?" అంటూ కొడుకు చంటి నళినిని అడిగాడు.

"ఎక్కడికి వెళితే నీకెందుకు? వెళ్లి చదువుకో" అంటూ కసిరింది నళిని.

కారు స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు ముకుందరావు.

"ఎక్కడికిరా హఠాత్తుగా బట్టలు సర్ది తీసుకెళ్తున్నావ్?" అడిగింది వెంకటలక్ష్మి.

"మన ఇంటి ఇల్లాలిగా నీ కోడలి ఒక కోరిక కోరిందమ్మా! తప్పనిసరి పరిస్థితుల్లో భర్తగా తీర్చాలి కదా" అన్నాడు కళ్ల నిండుగా కన్నీళ్లను నింపుకుంటూ ముకుందరావు.

"నాకు తెలుసురా.. ఇక్కడ ఉండి మాటలు పడటం కన్నా దూరంగా వుండటమే మేలు" అంది వెంకటలక్ష్మి.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు ముకుందరావు.

"ఆ రాత్రి మీరు మాట్లాడుకోవటం అంతా నేను విన్నానురా. నన్ను బాగా చూసుకోవాలనే తపన నీకైతే వుందిగానీ ఆ అదృష్టం నాకు లేదురా. ఎక్కడో డ్యూటీకి వెళ్లి నేను ఎలా వున్నానో అని కలవరపడే బదులు దూరంగా వున్నా మనశ్శాంతిగా వుందిలే అనే ఆనందం నీకుంటే చాలురా" కొంగుతో తన కళ్లను తుడుచుకుంటూ పేల గొంతుతో అంది వెంకటలక్ష్మి.

"ఏం చేయను? కొద్ది రోజులు భరించాలి.. తప్పదు. తల్లిని చూసుకోలేని అసమర్థుడినని అందరూ అనుకుంటారు. కానీ నిజం తెలియకపోదు" అన్నాడు ముకుందరావు.

"అవునురా! ఈ కాలపు అమ్మాయిలు చదువు పేరుతో బంధాలకు బంధువులకు దూరంగా బయటికి వెళ్లిపోతున్నారు. వారి మమకారం అంటే ఏమిటో అనురాగమంటే ఏమిటో బొత్తిగా తెలియకుండా పోతోంది. జీవితమంటే ఏమిటో తెలియకపోవడం వల్లనే వాళ్ల స్వేచ్ఛను కోరుకుంటూ బంధాలను


వదిలేస్తున్నారు. ఏ చిన్న బాధనైనా, బాధ్యతనైనా భరించే పరిస్థితుల్లో లేరు. దానికి ప్రతిఫలమే నాకు పట్టిన పరిస్థితి” అంది వెంకటలక్ష్మి.

అంతలో కారు ఒక ఆశ్రమం వద్ద ఆగింది. దిగి లోపలికి వెళ్లారు. తల్లి పాదాలకు నమస్కరించి కన్నీళ్లను తుడుచుకుంటూ వెనుదిరిగాడు ముకుందరావు.

డ్యూటీకి వెళ్లాడన్న మాటేగానీ తన రెక్కల కష్టంతో నన్ను ఇంతవాణ్ణి చేస్తే తల్లికి నేనిచ్చే గౌరవం ఇంతేనా.. అని కళ్లల్లో నీళ్లు ఉబికి వస్తున్నా భరించుకున్నాడు.

పెండింగ్ వున్న పని పూర్తి చేసి ఇంటికి వెళితే ఊయలలో ఊగుతూ పాటలు వింటున్న నళిని కనిపించింది. ఆమె ససంతోషానికి అవధుల్లేవు.

ఇలా కొన్నాళ్లు గడియిపోయింది.




...

ఒకరోజు నళిని తల్లి శారదమ్మకు ఆరోగ్యం బాగా లేదని కబురొచ్చింది. ఊరెళ్లాలని ఉన్నఫళంగా బయలుదేరింది నళిని. ముకుందరావు రోజువారీగా పనికి వెళ్లాడు. సరిగ్గా సమయం పన్నెండు గంటలు.. ఫోన్ మోగింది. రిసీవ్ చేసుకున్న ముకుందరావు స్థాణువైపోయాడు.

నళిని ఆటోలో వెళుతుంటే యాక్సిడెంట్ జరిగిందట. పిల్లలకు ఏం కాలేదు. తృటిలో తప్పించుకున్నారు. నళినికి మాత్రం కాలికి బలమైన గాయమైందని సమాచారం అందగానే హుటాహుటిన హాస్పిటల్‌కు చేరుకున్నాడు. కదలలేని పరిస్థితిలో బెడ్‌పై పడుకుని వుంది నళిని. ఆఫీసులో వర్క్ పెండింగ్ వుండడం వలన మూడు రోజుల కంటే ఎక్కువ సెలవు ఇవ్వకపోవడంతో నళినిని హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేయించి దిక్కు తోచని స్థితిలో అనాథ ఆశ్రమంలో వున్న తన తల్లి వెంకటలక్ష్మికి విషయం చెప్పి ఇంటికి తీసుకొచ్చాడు.

**నళిని ఆటోలో వెళుతుంటే యాక్సిడెంట్ జరిగిందట. పిల్లలకు ఏం కాలేదు. తృటిలో తప్పించుకున్నారు. నళినికి మాత్రం కాలికి బలమైన గాయమైందని సమాచారం అందగానే హుటాహుటిన హాస్పిటల్‌కు చేరుకున్నాడు.**

నళినికి కాలు పూర్తిగా నయం అయ్యేవరకు దగ్గరుండి సపర్యలు చేసింది వెంకటలక్ష్మి. “నువ్వింకా కొద్ది రోజులు విశ్రాంతి తీసుకో. నేనున్నాను.. పిల్లల గురించి బెంగ పెట్టుకోకు” అంటూ నళినికి ధైర్యం చెప్తూనే కష్టమైనా ఇంట్లో పనులన్నీ ఒక్కతే చేయసాగింది.

కొద్ది రోజులు పనిమనిషిని పెడదామని ముకుందరావు పలుమార్లు చెప్పి చూసాడు.. ససేమిరా అంది వెంకటలక్ష్మి. “నేనుండగా పనిమనిషి దేనికి? నా కోడలు బాగోగులు చూసుకోలేనా” అంటూ నళిని పూర్తిగా కోలుకునే వరకూ వెంకటలక్ష్మి కన్నతల్లిలా సేవ చేయడంతో నళిని కంట్లో తడిని పుట్టించింది.

ఒకరోజు అత్తగారిని పిలిచి “నాకు ఒక కోరిక వుంది అత్తయ్యా! తీర్చగలరా?” అని అడిగింది నళిని.

ఆ మాటకు ముకుందరావు ఉలిక్కిపడ్డాడు.

“నువ్వు కోలుకున్నావు. నా అవసరం నీకు లేదు, ఇక తిరిగి ఆశ్రమానికి వెళ్లిపొమ్మనే కదమ్మా నువ్వు కోరుకునేది” అంది వెంకటలక్ష్మి.

“అది కాదు అత్తయ్యా! ఇన్నాళ్లు కళ్లు నెత్తికెక్కి ప్రవర్తించాను నేను. మేముండి కూడా నిన్ను అనాథని చేసి ఆశ్రమంలో పెట్టించాను. లేనిపోనివన్నీ చెప్పి పాపం కట్టుకున్నాను. నాపై మీకు ఇంత ప్రేమ, మమకారం వుందని గ్రహించలేకపోయాను. జీవితాంతం మిమ్మల్ని బాగా చూసుకోవాలనేదే నా కోరిక. నన్ను మన్నించండి” అంటూ వెంకటలక్ష్మి కాళ్లపై పడబోయింది నళిని. భార్యలో వచ్చిన మార్పు ముకుందరావుకు అమితానందాన్ని ఇచ్చింది. మరుసటి రోజు ఠీవీగా బయలుదేరి యాక్టివ్‌గా డ్యూటీకి వెళ్లాడు. ❑

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా,**

## రచనలకు ఆహ్వానం

**హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యం, భారతీయ ఆత్మావిష్కరణానికి ప్రతీక. సర్వతోముఖ ప్రతిభావంతుడైన కవిసమ్రాట్ విశ్వనాథ తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను సుసంపన్నం చేసారు.

"నేను ఏమి వ్రాస్తానో నేను తెలిసికొని వ్రాస్తాను. కనుక అనాదినుంచీ ఈ దేశంలో ఒకటి జ్ఞానం అనిపించుకొంటూ అనంతంగా వస్తున్నది. ఆజ్ఞానం నా పాఠకులకు కన్పించి, నేను సఫలుణ్ణై వాళ్లని జ్ఞానవంతులని చేస్తున్నాను అనే భావం నాకు ఉన్నది" అంటారు.

ఎన్నెన్ని పాటలు పాడాం. ఆయా దృశ్యాలు కవితామయం చేసాం. మరి నువ్వు అడిగిన శ్రీశ్రీ అదే మహామథనంలో మంథర గిరి ఒరిపిడికి' నలిగిపోతున్న అట్టడుగు జీవరాశిని చూశాడు. అంతేనా, ఆ కొండ కింది చితికి చివుకుతున్న కోట్లాది అల్ప ప్రాణుల తాలుకు రక్తజీరను శ్రీశ్రీ చూశాడు,

భృంగము, ఆశావాణి, శ్రీహర్షుడు ఆ కాలం నాటివే. అప్పటికి 'ఏకవీర' తప్ప మరొక నవల రాయలేదు. క్రమేపీ 'వేయి పడగలు', 'మాబాబు', 'చెలియలి కట్ట', 'తెఱచిరాజు', 'స్వర్గానికి నిచ్చెనలు' వంటి నవలా సాహిత్యం విశ్వనాథకు నవలా రచయితగా ప్రాచుర్యం లభించింది. పురాణ వైర గ్రంథమాల పన్నెండు నవలలు, నేపాళ రాజ చరిత్రం ఆరు నవలలు, కాశ్మీర రాజ చరిత్రం ఆరు నవలలు చరిత్ర పరిశోధకునిగా, పురాణాలు అవాస్తవ పుక్కిటి కథలనే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాయి. పాశ్చాత్య చరిత్రకారులు,

# కవి సమ్రాట్ విశ్వనాథవారి సాహితీ విరాట్ స్వరూపం

సాహిత్యం

మహోన్నత ఆదర్శ శిఖరాలను అందుకొన్న మహా రచయితగా భారతీయ సాహితీ కులపతిగా, సమున్నత జ్ఞాన పీఠం అధిష్ఠించిన విశ్వనాథం, ప్రాచీన సాహిత్యం లోని విలువలు, అందాలు, రహస్యాలు, అద్భుత జ్ఞాన సంపదను సమకాలీన పాఠక లోకానికి అందించారు. ఆయన నవల, కథ, పద్యం, వ్యాసం, మహాకావ్యం, ఖండకావ్యం, పౌరాణిక ఉపన్యాసం, జీవిత సాహితీ సర్వస్వం చదువరులకు ఆనందాన్నే కాదు.. ప్రాచీన జ్ఞాన, విజ్ఞానాన్ని అవలో కింపచేస్తాయి. విశ్వనాథ సాహిత్య వైభవం బహుముఖీనంగా విలసిల్లింది.

"పూర్వ సాహిత్యం వుంది. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, నాచన సోమన, శ్రీనాథుడు, పోతన, పెద్దన, తెనాలి రామకృష్ణుడు వంటి పూర్వ కవులు పద్య రచనా సామ్రాజ్య పట్టభద్రులు, కథా కదన శిల్ప సృష్టికర్తలు, వేద వేదాంగాది మహా గ్రంథస్థలు, మహా విషయ నిర్ణేతలు, బహు విషయ వ్యాఖ్యాతలు కావ్య కథాశిల్ప రహస్యవేత్తలు అనే దృష్టితో ఆ పూర్వ కవులను అపూర్వ ఆరాధానా భావంతో నిలబెట్టుకొంటే అప్పుడు నేనూ నిలుస్తాను" అంటారు విశ్వనాథ.

ఇది అర్ధ శతాబ్దం నాటి మాట. రచయిత, జర్నలిస్టు రమణ ఒకసారి విశ్వనాథ వారిని, మహాకవి శ్రీశ్రీ మీద అభిప్రాయం అడిగారు. "మేం సంప్రదాయ కవులం. యుగాల నాటి క్షీర సాగర మథనం మహత్తర ఘటనను ఉదాహరణగా చెప్తున్నా. ఆ మహా మథనంలో ఐరావతం, కల్పతరువు, కామధేనువు, ఉచ్చైశ్రవం, చంద్రలేఖ, వారుణివాహిని, అచ్చరకన్నెలు.. ఏమేమి అద్భుతాలు! మాకు ఇవన్నీ కనిపించాయి. మేం వీటిని దర్శించి, పరవశించి ఎన్నెన్ని పద్యాలు చెప్పాం.

చలించాడు. గొంతు విప్పాడు. ఆ నిమ్న జీవుల ఆక్రందనల్ని లోకానికి వినిపించాడు. ఇదీ వైవిధ్యం" అదీ విశ్వనాథ మహోన్నత వ్యక్తిత్వ అంతరంగం.

1895లో భారత, భాగవత, రామాయణ పాండిత్య నిష్ణాత సంప్రదాయ కుటుంబంలో జన్మించిన విశ్వనాథ రచించిన పద్య గ్రంథాలు, నవలలు సాహితీ సర్వస్వంలో తెలుగు నుడికారాలు, పలుకు బళ్లు, సామెతలు, తెలుగు వాక్య నిర్మాణంలోని చిత్ర విచిత్ర వైఖరులు కూడా స్పష్టంగా ఉన్నాయి. ఆయన కావ్యాలలో సంస్కృత భాషా ప్రభావం కారణంగా, జటిల ఆంధ్ర భాషా పాండిత్యం విలసిల్లడానికి ఆయన పుట్టి పెరిగిన జీవితమే కారణం అయింది.

"నా ఆంధ్ర భాషా పాండిత్యానికి ప్రధాన గురువు మా తండ్రి, నా కుటుంబం, మా ఊరు, ఆనాటి బిచ్చగాండ్రు, మా పాలేళ్లు" అంటారు. 1979లో విశ్వనాథ పావనిశాస్త్రి ప్రచురింపచేసిన 'ఆత్మకథ' అసంపూర్ణమైనా, బాల్య, విద్యాభ్యాస సంబంధిత జీవిత విశేషాలను ఆవిష్కరిస్తోంది. తిరుపతి వేంకటేశ్వర కవులలో ఒకరైన చెళ్లపిళ్ళ వేంకట శాస్త్రిగారు, విశ్వనాథకు బందరులో ఆంధ్రోపాధ్యాయునిగా వుండేవారు. తదనంతరం వారినే విశ్వనాథ గురువుగా స్వీకరించారు. కవిసమ్రాట్‌గా విశ్వనాథ బాల్య, విద్యా దశలోని జీవిత ఘట్టాలను, నాటి సాంఘిక, సాంస్కృతిక, సాహితీ స్థితిగతులు తనను ఎలా ప్రభావితం చేసినదీ, ప్రతిబింబింపచేసారు. విశ్వనాథవారి సాహితీ ప్రస్థానం పద్యకవిగా ప్రారంభమైంది. 1934కు ముందే నాటి భారతి, శారద మొదలైన అనేక పత్రికలకు శర పరంపరగా పద్యాలు రాసారు. కవి

భారతీయ ప్రాచీన చరిత్రను వక్రరించిన వైఖరి వ్యతిరేకిస్తూ విశ్వనాథ, సుమారు అరవై నవలలో అవిశ్రాంతంగా శ్రమించి అనంతమైన కల్పనా వైవిధ్యంతో గద్య ప్రపంచం నిర్మించారు. ఆరు నదులు, పునర్జన్మ, సముద్రపు దిబ్బ, మ్రోయు తుమ్మెద, బాణివతి, దమయంతీ స్వయంవరం.. వంటి నవలలు, రచనలు రామాయణ కల్పవృక్షం వంటి మహా కావ్యాలు, గోపికా గీతలు, భ్రమర గీతలు, శ్రీకృష్ణ సంగీతం, కిన్నెరసాని పాటల తెలుగు భాషలో అసంఖ్యాక సాహితీ సృష్టి పూర్వ కవుల ప్రతిభా విశేషాలను మించిన ఆధునిక సాహితీ సృజనతో లబ్ధ ప్రతిష్టులయ్యారు.

కవి సమ్రాట్ విశ్వనాథ పూర్వాచార పరాయణునిగా, కాల ప్రవాహానికి ఎదురీదే సనాతన ఛాందస సాహితీవేత్తగా తీవ్ర నిందా విమర్శలు ఎదుర్కొన్నారు. శ్రీశ్రీ, చలం వంటి ఆధునిక సాహితీవేత్తల సమకాలికునిగా, ఉత్తర, దక్షిణ ధృవాల సారూప్యంతో కాలానికి ఎదురీదారు. ఆధునికాంధ్ర సాహితీ జగత్తులో విశ్వనాథ ఒక విరాణ్మూర్తి. ప్రాచీనాధునిక ఆంధ్ర సాహితీ ప్రక్రియలలో విరాట్ రూపానికి ఎంత పీట వేసినా చిన్నదే. విశ్వనాథ కిన్నెరసాని పాటలకు తెలుగుదేశం పరవశించింది. ఆంధ్ర ప్రశస్తి అమరగానమైంది. విశ్వనాథవారి పేరు స్మరించగానే ఈ పద్యం స్ఫురణకు వస్తుంది. "అలా నన్నయకు లేదు తిక్కనకు లేదా భోగమే స్మాదృశుండు" విశ్వనాథ నిస్సందేహంగా హిమవన్నగ శృంగంలా నిలిచిన ధవళ కీర్తి చంద్రికలను ప్రసరింపచేసిన మహా సాహితీ విరాట్ స్వరూప తేజోమూర్తి.

**- జయసూర్య**

సింగిల్ పేజీ కథ

# నా చేతిలో ఏముంది..

ఆర్.సి.కృష్ణస్వామి

భాగ్యనగరంలో నేషనలైజ్డ్ బ్యాంకులో ఆఫీసరుగా పనిచేసి రిటైర్ అయ్యాడు చెంచునాయుడు. పుట్టి పెరిగిన పల్లెటూరిలో శేషజీవితం గడుపుదామని పల్లెబాట పట్టాడు. తన బాల్యంనాటి కన్నా ఊరు రెండింతలు పెరిగి ఉండడం అతడికి ఎంతో ఆనందాన్నిచ్చింది.

కొన్ని రోజులు కాపురమున్నాక "ఊరు అయితే పెరిగింది కానీ వసతులు పెరగలేదు" అని అర్థమయ్యింది.

"ఎప్పుడో పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్, గ్రామ ప్రజల కరెంటు అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చలేకపోతోంది. ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్‌కి తోడుగా ఇంకొకటి ఏర్పాటు చేస్తే కరెంటు కష్టాలు తీరుతాయి" అని అభిప్రాయపడ్డాడు.



పేపర్లలో 'పల్లెలు వెలిగిపోతున్నాయి' లాంటి ప్రకటనలు చూసి చాలా సంతోషపడ్డాడు. అధికారులను కలిసి తన ప్రణాళికను సుసాధ్యం చేయవచ్చని భావించాడు. ఒక శుభ ముహూర్తంలో టిప్‌టాప్‌గా తయారై అర్జీలు రాసి ఎవరెవరిని కలవాలో నిర్ణయించుకున్నాడు. ఉదయం ఆరింటికంతా స్కూటర్‌ని శుభ్రంగా తుడిచి సర్రున గ్రామ సర్పంచ్ ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు.

అభిమానంగా సర్పంచ్ ఇంట్లోకి ఆహ్వానించి మసాలా టీ తాగించాడు. పెద్దాయన ఇంటికి వచ్చాడని మనవళ్లను పిలిచి ఆశీర్వాదాలు ఇప్పించాడు. వచ్చిన విషయం తెలుసుకుని "మరో ట్రాన్స్‌ఫార్మర్ మన ఊరికి కచ్చితంగా అవసరం. అయినా అది చేయాల్సింది కరెంటు డిపార్ట్‌మెంట్‌వాళ్లు కదా, నా చేతిలో ఏముంది?" అని బాధగా చెప్పాడు.

"నిజమే కదా" అనుకున్న చెంచునాయుడు కరెంటు లైన్‌మెన్ ఇంటికి వెళ్లాడు.

లైన్‌మెన్ సోఫాలో కూర్చుని టీవీ చూస్తున్నాడు. అతడి బొజ్జపైన బుల్లిమనవడు కూర్చుని, ఎద వెంట్రుకలను లాగుతూ ఉన్నాడు.

వచ్చిన విషయం పూసగుచ్చినట్లు చెప్పాడు చెంచునాయుడు.

"నిజమే సార్! ఊళ్లోవాళ్ల కష్టాలు చూడలేకపోతున్నాను. కరెంటు సరఫరా హెచ్చుతగ్గులు వస్తూ ఫ్యూజులు ఎగిరిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం జరుగుతోంది. ఇంకొకటి పెడితే బాగుంటుంది. అయినా అది నా చేతిలో ఏముంది? సబ్ ఇంజినీర్‌నో అసిస్టెంట్ ఇంజినీర్‌నో కలవండి" అని ఉచిత సలహా ఒకటి ఇచ్చాడు.

చిన్నగా అక్కడి నుంచి సబ్ స్టేషన్‌కి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడి ఇంజినీర్లు లేరు. పక్కనే ఉన్న కానుగచెట్టుకింద గంటసేపు కూర్చున్నాడు.

కొద్దిసేపటికి మోటార్‌సైకిల్లో అసిస్టెంట్ ఇంజినీర్ వచ్చాడు. విషయం వివరించాడు చెంచునాయుడు. అసిస్టెంట్ ఇంజినీర్ తీవ్రమైన సానుభూతి వ్యక్తం చేశాడు. "నేను కూడా రైతుబిడ్డనే. రైతుకళ్లల్లో కురిసే కడగండ్లవాన నాకు తెలుసు. మా ఊళ్లో కూడా ఇదే సమస్య ఉంది. అయినా నా చేతిలో ఏముంది? మా పై ఆఫీసర్ అయిన అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ సార్ దృష్టికి తీసుకెళ్లండి" అని చెప్పి పంపాడు.

వెంటనే స్కూటర్‌ని అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ ఆఫీసు వైపు తిప్పాడు. చల్లటి ఎయిర్ కండిషన్ గదిలో ఉన్న సారుకు నమస్కారం చేసి తను వచ్చిన పని చెప్పాడు.

సీట్లోంచి నుంచి లేచి "మీ లాంటి సామాజిక సేవ చేసేవారంటే నాకు చాలా ఇష్టం సార్. కచ్చితంగా చేయాల్సిన పని ఇది. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. అయినా నా చేతిలో ఏముంది? మా డివిజినల్ ఇంజినీర్‌ని కలవండి" అని చెప్పాడు.

అప్పటికే బాగా అలసిపోయి ఉన్న చెంచునాయుడు ఆఫీసుగది బయటికి వచ్చి రోడ్డు పక్కనున్న బోరునీళ్లతో ముఖం కడుక్కొంటున్నాడు.

అప్పుడే అక్కడికి వచ్చాడు రిపోర్టర్ రఘువీర. దూరపు చుట్టమైన చెంచునాయుడిని గుర్తించి క్షేమసమాచారాలు అడిగాడు. తను ఎందుకు వచ్చిందీ తెలియజేశాడు చెంచునాయుడు. తను కలిసిన వారందరూ "తమ చేతిలో ఏమీ లేదు అని చెబుతున్నారు" అని కూడా చెప్పాడు.

అందుకు రఘువీర నవ్వుతూ "వారు చెప్పింది నూటికి నూరు పాళ్లు నిజం. కానీ మీరు వాళ్ల మాటలను సరిగ్గా అర్థం చేసుకోలేదు. వాళ్ల చేతుల్లో ఏమీ లేదని చెప్పడంలో అర్థం ఏమిటంటే తమ చేతులు ఖాళీగా ఉన్నాయని.. చేతుల్లో ఏమన్నా పెట్టమని. మీరు వారి చేతుల్లో ఏమీ పెట్టకుండా అర్జీ ఎత్తుకుని ఇంకా డివిజినల్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్.. ఇలా పై అధికారుల్ని ఎందరిని కలిసినా ఫలితం ఉండదు. వాళ్లకు చేరాల్సింది చేరితే మీ అర్జీలకు రెక్కలొస్తాయి" అని చెప్పి వెళ్లిపోయాడు.

మర్మం తెలుసుకున్న చెంచునాయుడు మరునాడే సర్పంచ్ ఖాళీచేతిని పూర్తిగా నింపాడు. ఇది జరిగిన వారానికే సర్వే, ఎస్టిమేషన్ పూర్తయ్యింది.

రెండు వారాల తర్వాత ఊరికి ఆగ్నేయంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తూ ఉన్నారు సిబ్బంది.

ఊళ్లోవాళ్లంతా సినిమా చూస్తున్నట్లు నిలబడి చూస్తూ ఉన్నారు. ఏర్పాట్లు చూస్తూ ఉన్న చెంచునాయుడి స్కూటర్ 'కీచైన్'లో ఉన్న గాంధీగారి బొమ్మ నవ్వుతూ ఉంది. ❑

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458



# దుకాణంలో 'గల్లాపెట్టె' ఏ దిక్కులో ఉండాలి?

పడమర ముఖ ద్వారం వున్న దుకాణానికి 'నైరుతి' స్థానం ఒక్కటే వాస్తు ప్రకారం యజమాని కూర్చోవటానికి అనువైన స్థానం.

దుకాణంలో ఫ్లోరు వేసేటప్పుడే ఫ్లోరు దక్షిణం నుండి ఉత్తరానికి, పడమర నుండి తూర్పుకు వాలు వచ్చేలా జాగ్రత్త పడాలి. నైరుతి మూలలో అరుగు పైనగానీ, మామూలుగా కుర్చీ పైనగానీ వీలును బట్టి ఉత్తరాభిముఖంగాగానీ, తూర్పుకు అభిముఖంగా గానీ కూర్చోవాలి. ఉత్తరాభిముఖంగా కూర్చుంటే ఎడమ చేతి వైపు, తూర్పుకు అభిముఖంగా కూర్చుంటే కుడి చేతి వైపు గల్లాపెట్టెను అమర్చుకోవాలి. అలా అమర్చుకోవటం వల్ల గల్లాపెట్టె కూడా తూర్పుకు లేదా ఉత్తరానికి అభిముఖంగా తెరుచుకోవడం జరుగుతుంది.

దుకాణంలోకి నడిచివచ్చే కస్టమర్లను ఉచ్ఛదిశగా దుకాణంలోకి ప్రవేశించే విధంగా దారి వదలాల్సి ఉంటుంది.

పశ్చిమ ముఖ ద్వారం వైపు నైరుతి మూల నుండి వాయువ్య మూల వరకు ఎంత పొడవు వుందో కొలిచి అందులో సగ భాగం వద్ద 'మార్క్' చేసుకొని, వాయువ్యం మూల నుండి ఆ మార్క్ వరకు మెట్ల నిర్మాణం గావించడం వలన దుకాణంలోకి వచ్చేవాళ్లు ఆ దారి గుండానే అంటే ఉచ్ఛ స్థానంలో దుకాణంలోకి ప్రవేశిస్తారు. అలాగే బయటకెళ్లటం జరుగుతుంది.

షట్టర్స్ రెండుగానీ అంతకంటే ఎక్కువగానీ వున్నప్పుడు రెండు షట్టర్స్‌ను తెరిచి పెట్టాలి. లేదా నైరుతి వైపు షట్టర్‌ని మూసి వాయువ్యం వైపు షట్టర్‌ను తెరిచి వుంచాలి. కానీ వాయువ్యం వైపు షట్టర్‌ని మూసిపెట్టి, నైరుతి వైపు షట్టర్‌ని తెరిచిపెట్టకూడదు.

దుకాణం ఉదయంపూట తెరిచేటప్పుడు మొదట వాయువ్యం వైపు షట్టర్‌ని తెరిచి, ఆ తర్వాత నైరుతి వైపు షట్టర్‌ని తెరవాలి. అదే విధంగా రాత్రి దుకాణం మూసివేటప్పుడు మొదట నైరుతి వైపు షట్టర్‌ని మూసి, ఆ తర్వాతే వాయువ్యపు షట్టర్ మూయాలి.

నైరుతిలో కూర్చున్న యజమాని తన వెనుక గోడకు దేవుని పటం పెట్టి పూజించటం సాధారణంగా కనిపిస్తుంది. కానీ అది సరైన పద్ధతి కాదు. దుకాణంలో, ఈశాన్య మూల ఒక అడుగు వదిలి దేవుని పటం అవసరమైనంత ఎత్తులో తూర్పుగోడకుగానీ, ఉత్తరపు గోడకుగానీ అమర్చి పూజించాలి. లేదా వాయువ్య



మూలన పశ్చిమ గోడకు పటాన్ని అమర్చి పూజించాలి. మరో దిక్కులో పూజించటం వల్ల మంచి ఫలితాలు ఎక్కువగా కనిపించవు.

### దక్షిణ ముఖ ద్వార దుకాణాలు

దక్షిణ ముఖ ద్వారం వున్న దుకాణాలకు కూడా నైరుతి స్థానం ఒక్కటే యజమాని కూర్చోవటానికి 'వాస్తు' ప్రకారం అనువైన చోటు. ఫ్లోరు దక్షిణం నుండి ఉత్తరానికి, పశ్చిమం నుండి తూర్పుకు వాలు వచ్చి ఈశాన్యం అన్ని మూలల కంటే పల్లంలో వుండేట్టు జాగ్రత్త పడటం తప్పనిసరి. నైరుతి మూల ఉత్తర, తూర్పు దిక్కులు అనువైనట్టు అభిముఖంగా కూర్చొని వ్యాపారం జరుపుకోవాలి. తూర్పుకు మొహం చేసి కూర్చున్నప్పుడు కుడి చేతి వైపు, ఉత్తరానికి మొహం చేసి కూర్చున్నపుడు ఎడమ చేతి వైపు గల్లాపెట్టెను అమర్చుకోవాలి. గల్లాపెట్టె తూర్పు లేదా ఉత్తరాభిముఖంగా మన వీలునుబట్టి వుండేలా చూసుకోవాలి. దుకాణంలోకి నడిచివచ్చే కస్టమర్లకు ఉచ్ఛస్థానంలో దారి ఏర్పాటు చేసుకోవటం కూడా ముఖ్యమైంది. దక్షిణ ముఖ ద్వార దుకాణాల్లోకి కస్టమర్లు వాస్తుప్రకారం దక్షిణ ఆగ్నేయ మార్గంలో నడవటం కంటే మరో గత్యంతరం వుండదు. అందువల్ల మెట్ల నిర్మాణం దక్షిణ ఆగ్నేయ భాగంలో చేయటం మంచిది.

దక్షిణ భాగంలోని (ముఖ ద్వారం వైపు) భుజాన్ని కొలిచి అందులో మధ్య భాగానికి 'మార్క్' చేయాలి. ఆ తరువాత ఆగ్నేయ మూల నుండి ఆ మార్కు వరకు మెట్లు నిర్మించటం వల్ల ఆ మెట్ల మధ్య దక్షిణం నుండి ఆగ్నేయ మూల వరకు సాగుతుంది. కస్టమర్ల నడక ఆ మెట్ల మీదుగా దుకాణంలోకి రావడం వలన వాళ్ల నడక ఉచ్ఛ స్థానంలో జరిగి మంచి ఫలితాలు కలుగుతాయి.

దుకాణానికంతటికీ ఒకే షట్టర్ వుంటే పర్వాలేదు. కానీ రెండు, అంతకు మించి షట్టర్స్ వుంటే మాత్రం ఆ షట్టర్స్ తీసిపెట్టటంలో యజమాని జాగ్రత్త వహించాలి.

దక్షిణ ఆగ్నేయం మూలనున్న షట్టర్ 3)ని ఎప్పుడూ తెరిచి పెట్టాల్సి ఉంటుంది. ఆ షట్టర్‌ని మూసి నైరుతి వైపు 1) దక్షిణ వైపు 2) షట్టర్స్‌ని తెరిచి పెట్టకూడదు.

దుకాణం తెరిచేటప్పుడు మొదట ఆగ్నేయం వైపు వున్న 3) షట్టర్‌ని తెరిచి, ఆ తర్వాతే 2,1 షట్టర్స్‌ని తెరవాలి. రాత్రి దుకాణం మూసే సమయంలో మొదట నైరుతి వైపు 1) షట్టర్‌ని దక్షిణం 2) షట్టర్‌ని మూసి ఆ తర్వాతే దక్షిణ ఆగ్నేయ 3) షట్టర్‌ని మూసివేయాలి.

దక్షిణ ముఖ ద్వార దుకాణాల్లో కూడా యజమాని తన 'కౌంటరు' వెనుకనున్న గోడకు పటాలు పెట్టా పూజించటం కంటే దుకాణంలోని ఈశాన్యంగానీ, వాయువ్యంలో పశ్చిమగోడనానుకొనిగానీ దేవుని పటాలు పెట్టి పూజించటం వలన మంచి ఫలితాలు కలుగుతాయి. ◆

**పుస్తక దుకాణాలలో చిన్న పిల్లలను చూడడం అపూర్వమైపోయింది. చెన్నైలో ఉన్నప్పుడు తరచూ కొన్ని పుస్తక దుకాణాలకు వెళ్తుండేవాడిని. అలా వెళ్లినప్పుడు మధ్య వయస్కులు, వృద్ధులను చూస్తుండేవాడిని.**

# గల్లివర్ ట్రావెల్స్


సెలవు రోజులలో కాలేజీ విద్యార్థులు చాలా మంది పుస్తక దుకాణాలలో కనిపించేవారు. వారు కూడా రావడం తగ్గించేసారు. ఒకవేళ పెద్దవాళ్లతో పిల్లలు వచ్చినా ఇంగ్లీషు పుస్తకాలుండే వైపు వెళ్లిపోతారు. అటువంటి పిల్లలు మాట్లాడటానికి మాత్రమే తమిళ మాతృభాషను ఉపయోగించేవారు. రాయడం, చదవడం అంతగా రాదు. తమిళ పాఠాలను కూడా ఇంగ్లీషులో రాసి చదివిన పిల్లలు తెలుసుకు. వాళ్లు పుస్తకాలను అక్కర్లేనివాటిగా ఎందుకు చూస్తున్నారో తెలీడం లేదు. నవల, వ్యాసాలు, కవితలకు సంబంధించి ఎన్నో రకాల పుస్తకాలున్నప్పటికీ వాటి గురించి పెద్దగా ఆలోచించరు. అది బాధాకరమైన విషయమే. ఇంగ్లీషులో చేతన్ భగత్ పుస్తకం రావడానికి ముందు వచ్చిన తర్వాత దాని గురించి ఏదో ఒక సమాచారాన్ని సామాజిక మాధ్యమాలు ఇస్తూనే ఉంటాయి. కానీ మాతృభాష పుస్తకాలకు వచ్చేసరికి దాని గురించి పెద్దగా పట్టించుకోరు.

"పుస్తక దుకాణా లకు పెద్దలు కూడా రావడం తగ్గించే సారు. అటువంటప్పుడు పిల్లలు రావడం లేదనడం తప్పు కదా.." అని ఒ మిత్రుడు నన్ను ప్రశ్నించాడు.

కానీ అది తప్పే అంటాను. సినిమా థియేటర్లకు, షాపింగ్ మాల్సుకు పిల్లలు పెద్దవాళ్లతో కాకుండా విడిగా వెళ్తూనే ఉన్నారుగా. వారు వెళ్లే షాపింగ్ మాల్స్‌లో ఉండే పుస్తక దుకాణం వంక ఎందుకు కన్నెత్తి చూడరన్నది నా ప్రశ్న.

"ఆన్‌లైన్లోకొంటారని" మిత్రుడు తన మాటగా చెప్పాడు.

అది వంద శాతం నిజమనను పది శాతం మంది పిల్లలు కూడా పుస్తక




దుకాణాలకు వెళ్లడం లేదనేదే నిజం. కారణం.. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను కాకుండా పాఠ్యాంశాలకు అతీతంగా ఇతర పుస్తకాలను విద్యాసంస్థలు పరిచయం చేస్తున్నాయా అనేది ఆలోచించవలసిన విషయమే. కనీసం వారానికొకసారి విద్యార్థులను మాష్టారు రోడ్డు పక్కనున్న పాత పుస్తకాల దుకాణాలకు తీసుకుపోయి తక్కువ ధరలకు లభించే పుస్తకాలను కొనిపించవచ్చు కదా.

స్కూళ్లల్లో నిర్వహించే పోటీలలో విద్యార్థులకు బహుమతిగా పుస్తకాలను ఇచ్చే సంప్రదాయం ఉంది. కాదనను.. కానీ వాటిని చదివే విద్యార్థులు ఎందరు? అసలు ఒక్కొక్కసారి అలా కానుకగా ఇచ్చే పుస్తకాలు విద్యార్థులకు ఉపయోగపడేటట్లుగా ఉండవు కూడా.

నాకు తెలిసిన ఓ పాఠశాలలో విద్యార్థులకు ఆ స్కూలు హెడ్మాస్టర్ రాసిన వ్యాసాల పుస్తకాన్ని ఇచ్చారు. విద్యార్థులు కార్యక్రమం ముగిసి ఇళ్లకు వెళ్లిపోతున్నప్పుడు ఆ పుస్తకాలను కావాలనే రోడ్డు పక్కన విసిరేయడం చూశాను.. మనసు చివుక్కుమంది.

నా మిత్రుడు ఎస్.రామకృష్ణన్ తన అనుభవాన్ని ఇలా రాసారు..

ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు "లెక్కల పరీక్షల్లో నూటికి నూరు మార్కులు పొందడం ఎలా?" అనే పుస్తకాన్ని ఇచ్చారు. అసలు ఆయనకు ఆ పుస్తకం ఏ మేరకు ఉపయోగపడుతుంది, తనకు ఆ పుస్తకం ఇవ్వాలని నిర్ణయించుకున్న వారిని ఏమనుకోవాలి. ఇటువంటి సంఘటనలు అక్కడక్కడా జరుగుతూనే ఉంటాయి.

యోగా, సంగీతం, చిత్రలేఖనం, తరగతులా వారానికి ఒకటో రెండో సార్లు రకరకాల పుస్తకాలను పరిచయం చేసే విధానాన్ని పాఠశాలలన్నీ అమలు చేస్తే బాగుంటుంది. అప్పుడే పుస్తకాలు చదివే అలవాటు విద్యార్థి లోకంలో విస్తరిస్తుంది.

ఇంట్లో మా నాన్నగారి దగ్గర పుస్తకాలు చాలానే ఉండేవి. వాటిలో నేనప్పట్లో చదివే పుస్తకాలను వేళ్ల మీద లెక్కించవచ్చు. కానీ వాటిని మా నాన్నగారు సర్దుతున్నప్పుడల్లా వాటిని తుడిచి అందించడం చేస్తుంటే ఆనందం వేసేది. నా చిన్నప్పుడు పాత పుస్తకాలమ్మే దుకాణాలకు వెళ్లి చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాల కోసం చదివేవాడిని. అలాగే మల్లాది రామకృష్ణశాస్త్రి గారి వల్ల ఇంగ్లీషులో అనేక కామిక్స్ పుస్తకాలు చదివిన రోజులున్నాయి. ఓమారు తమిళంలో గల్లివర్ ట్రావల్స్ పుస్తకం తమిళ అనువాద పుస్తకం చదివాను. మూల రచయిత పేరు జోనాథన్ స్విఫ్ట్. 1726లో వచ్చిన నవల ఇది.

తమిళంలో మొదటగా సంక్షిప్త రూపాన్ని చదివాను. తమిళంలో యూమా వాసుకి ఈ పుస్తకాన్ని తమిళంలో అనువదించారు.

చిన్‌జోనాథన్ స్విఫ్ట్ 1667 నవంబరు 30న జన్మించారు. 1745 అక్టోబరు 19న మరణించారు. ఈయన ఆంగ్లో-ఐరిష్ రచయిత, కవి, వ్యాసకర్త, రాజకీయ వేత్త. కొంత కాలం ఆయన డబ్లిన్‌లోని సెయింట్ పాట్రిక్స్ చర్చిలో పని చేశారు. ఆ తరువాత అక్కడే అధికారి అయ్యాడు. ఆయన రాసిన గల్లివర్ ట్రావెల్స్ ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఈయన రాసిన ఇతర ప్రసిద్ధ రచనలు బ్యాటిల్ ఆఫ్ ది బుక్స్, డ్రేపర్స్ లెటర్స్. ఆయన తండ్రిపేరు కూడా జొనాథన్ స్విఫ్ట్. తల్లి పేరు హెరిక్. ఆయన తన తల్లితో కలిసి శరణార్థిగా ఇంగ్లండ్ వెళ్లారు. అక్కడ తన సమీప బంధువు గుడ్విన్ రక్షణలో పెరిగారు. ఈయన రాసిన గల్లివర్ నవలలో కథానాయకుడు ఓ వైద్యుడు. ఆయనకు సముద్ర ప్రయాణం అంటే మహా ఇష్టం. అయితే అనుకోకుండా ఓ యాత్రలో తుఫానులో చిక్కుకుంటాడు. అతను ప్రయాణం చేస్తున్న నౌక బోల్తా పడుతుంది. అయితే అతి కష్టంమీద ఒడ్డుకు చేరుకుంటాడు. కళ్లు తెరిచి చూడగా అతనిని కట్టేసి ఉండటం గుర్తిస్తాడు. అతనిని కట్టేసిన వాళ్లంతా



బొటను వేలంత ఎత్తున్నవారే. అంటే అంత పొట్టివారు, లిల్లీపుట్స్ అన్నమాట. వారు గల్లివర్‌కి అన్నపానాదులు అందిస్తారు. రాజుగారి కోటకు తీసుకుపోతారు. రాజుకి అప్పగిస్తారు. ఇలా సాగే ఈ నవల భలే రసవత్తరంగా ఉంటుంది. 1700లలో సముద్ర ప్రయాణాలకు సంబంధించి అనేక పుస్తకాలు వచ్చాయి. వాటిలో కొన్ని అతిగా ఉండటం చూసి జోనాథన్ స్విఫ్ట్ వాటిని గేలి చేసే విధంగా ఈ పుస్తకం రాశారు. ఇప్పుడు ప్రపంచం అంతటా పరిచయమై వాడుకలో ఉన్న లిల్లిపుట్, యాహూ అనే మాటలు జొనాథన్ స్విఫ్ట్ తన నవలలో మొదటిసారిగా పరిచయం చేసినవే. ఈ నవలను ఆధారంగా చేసుకుని నాలుగు సార్లు సినిమా తీశారు. ఓమారు బుల్లితెర మీద నాటకంగానూ వచ్చిందీ నవల. మరుగుజ్జు మనుషులు అనగానే గుర్తుకు వచ్చేది గల్లివర్ ట్రావెల్స్ పుస్తకమే. ఈ పుస్తకానికి ప్రపంచ సాహిత్యంలో ప్రత్యేక స్థానముంది. చూడడానికి పిల్లల కథలాగే అనిపిస్తుంది. కానీ సమాజం ఓ ఒంటరి మనిషిని ఎలా చూస్తుందనేది ఈ నవల మూల కథ. వేర్వేరు సమాజాలలో అక్కడి సంస్కృతిని, సంప్రదాయాలను, నాగరికతను ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు. కనుక ఇది అందరూ చదవతగిన పుస్తకాలలో ఒకటి అనడం అతిశయోక్తి కాదు.

**- యామిజాల జగదీశ్**

# ఈవినింగ్ స్నాక్స్

## సగ్గుబియ్యంతో మురుకులు

**కావలసి పదార్థాలు**

బియ్యప్పిండి-కప్పు
సగ్గుబియ్యం-పావు కప్పు



పెరుగు-పావు కప్పు
మినప్పప్పు-రెండు స్పూన్లు
నువ్వులు-ఒక స్పూను
కారం-అర స్పూను; నూనె- వేయించేందుకు సరిపడా; ఉప్పు-తగినంత.

**తయారు చేసే విధానం**

పెరుగులో సగ్గుబియ్యం వేసి కనీసం మూడు గంటలసేపు నానబెట్టాలి. తరువాత అందులో నూనె మినహా మిగిలిన పదార్థాలన్నీ వేసి బాగా కలపాలి. అవసరమనిపిస్తే నీళ్లు చల్లుకుంటూ మురుకుల పిండిలా చేసుకోవాలి. చివరగా రెండు చెంచాల వేడినూనె కూడా వేసి ఓసారి కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని మురుకుల గొట్టంలో తీసుకుని, కాగుతున్న నూనెలో జంతికల్లా వత్తుకుని ఎర్రగా వేయించుకోవాలి.

## మిక్చర్

**కావలసిన పదార్థాలు**

నైలాన్ సగ్గుబియ్యం-అర కప్పు
పల్లీలు-పావు కప్పు; కిస్‌మిస్-పావు కప్పు; జీడిపప్పు-పావు కప్పు
కారం-పావు స్పూను; ఉప్పు-తగినంత
నూనె-వేయించుకునేందుకు సరిపడినంత.

**తయారు చేసే విధానం**

స్టౌ మీద బాణలి పెట్టి వేయించేందుకు సరిపడా నూనె వేయాలి. అది వేడయ్యాక సగ్గుబియ్యాన్ని కొద్ది కొద్దిగా వేసుకుంటూ అవి పొంగేవరకూ వేయించుకుని ఓ గిన్నెలో వేసుకోవాలి. అదే విధంగా పల్లీలు, జీడిపప్పు, కిస్‌మిస్‌లను ఒక్కొక్కటిగా వేయించుకోవాలి. వీటన్నింటినీ ఓ గిన్నెలో తీసుకుని ఉప్పు, కారం కూడా వేసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ❑





# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. స్త్రీలకు ఆకస్మికంగా స్థిరాస్తులు కలిసివస్తాయి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి బాగుంటుంది. ఉద్యోగులకు పనివత్తిడి అధికం. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం తెలుస్తుంది. చర్చలు ఫలిస్తాయి.

## వృషభం



గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరవతాయి.

## మిథునం



దేశాంతర ప్రయాణం చేస్తారు. వృత్తి రంగాల్లో వున్న వారికి పోటీ ఏర్పడుతుంది. ఆకస్మిక ధన లాభం. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం లభిస్తుంది. సొంతింటి కల సాకారమవుతుంది. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని నిశ్చయించుకుంటారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. ఆరోగ్య సమస్యలుంటాయి.

## కర్కాటం



ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. వృద్ధాశ్రమాలకు ఆర్థిక చేయూతనందిస్తారు. ప్రారంభించిన పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ప్రయాణం లాభిస్తుంది.

## సింహం



భాగస్వామ్య వ్యాపారులకు బాగుంటుంది. తాహతుకు మించిన రుణాలు చేయకపోవడం మంచిది. దేశాంతర ప్రయాణం చేస్తారు. ఉద్యోగంలో ఒడుదుడుకులు ఉంటాయి. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది.

## కన్య



చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువులు/పత్రాల పట్ల అప్రమత్తంగా ఉండండి. సాహిత్య సభల్లో పాల్గొంటారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. శత్రువులు మిత్రులవుతారు. వ్యాపారులకు పోటీ ఉంటుంది. చర్చలు వాయిదా.

## తుల



పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. మీకు రావాల్సిన బకాయిలు వారాంతంలో వస్తాయి. విద్యార్థులకు విదేశీయాన యోగం. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. శుభ కార్యాలకు హాజరవుతారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. జీవిత భాగస్వామి ద్వారా స్థిరాస్తి కలిసొస్తుంది. ఉద్యోగ ప్రయత్నం ఫలించే సూచనలున్నాయి. చిరు వ్యాపారులకు బాగుంటుంది.

## వృశ్చికం



విద్యార్థుల శ్రమకు ఫలితం లభిస్తుంది. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుంది. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. శత్రువులు మిత్రులవుతారు. వృత్తి వ్యాపారస్తులకు ఆర్థికంగా బాగుంటుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక నెరవేరుతుంది. గృహ రుణాలు తీరుస్తారు. వ్యవసాయదారులకు బాగుంటుంది. వివాదాలు తీరుతాయి.

## ధనుస్సు



ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. సమయ స్ఫూర్తితో ముఖ్యమైన పనులు పూర్తి చేసుకుంటారు. కుటుంబంలో స్వల్ప మనస్పర్థలకు అవకాశం. ప్రారంభించిన పనులు వారాంతంలో పూర్తవుతాయి. విద్యార్థుల కృషికి ఫలితం లభిస్తుంది. ఊహించని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. తాహతుకు మించిన రుణాలు చేస్తారు. వృథా కాలక్షేపం చేస్తారు. హోల్‌సేల్ వ్యాపారులకు యథాతథం.

## మకరం



స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. చిరు వ్యాపారులకు ఆర్థికంగా ఆశాజనకంగా ఉంటుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వాయిదా. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. శత్రువులు మిత్రులవుతారు. కుటుంబంలో ఐకమత్యం కొరవడుతుంది, సంయమనంతో వ్యవహరించండి. కళాకారులకు సన్మాన యోగం. కోర్టు తీర్పులు అనుకూలం.

## కుంభం



తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటారు. వృథా ఖర్చులను నియంత్రిస్తారు. విలువైన వస్తువులు లభిస్తాయి. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. చిరకాల కోరిక నెరవేర్చుకుంటారు. విదేశాల్లో వున్న బంధువుల నుండి శుభ సమాచారం తెలుసుకుంటారు. వాహన యోగం.

## మీనం



ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. స్త్రీలకు శుభ యోగం. అనవసర ఖర్చులను అదుపు చేయడంలో విఫలమవుతారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో మెళకువలు నేర్చుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఆరోగ్యం కుదుట పడుతుంది. శుభ కార్య చర్చలు వాయిదా వేయడం మంచిది. అనూహ్యంగా మొండి బాకీలు వసూలవుతాయి. సాహస యాత్రలు చేస్తారు.




**దాబా** మీద నీలాకాశం వంగి
ఈ ఆకుపచ్చని ఆకాశాన్ని
వింతగా చూస్తుంది
అసూయ పడుతుంది.
ప్రతి దినం
రంగు రంగుల నక్షత్రాలు
మెరుపులీనుతూ విస్మయపరుస్తాయి.
మట్టిసుగంధం
నాసిక గుండా హృదయానికి
ప్రయాణిస్తుంది.
ఉన్నట్టుండి ఒక ఉడుతపిల్ల
నన్ను చూసి అల్లరి మేఘమవుతుంది
బంగారు పిట్ట
కొత్త పాట అందుకుంటుంది.
నా చిరాకులను తుడిచేసి
లోలోకి పత్రహరితాన్ని ఒంపి
నా పెదవులపై
చిరునవ్వులను పూయించే
నందనవనమది
కాలుష్యంతో
గరగరలాడే గాలి
గొంతును సవరించి
తేలికపరచే పసరుమందు.
విత్తులోంచి మొలక
రెండు రెప్పలనెత్తి చూసినపుడు
రెమ్మ చివర పసిమొగ్గ
మృదువుగా జన్మించినపుడు
ఆనంద స్వర్గం
నన్ను కౌగిలిస్తూనే ఉంటుది.
ఎన్నో ఏళ్ల కల
నా సమయానికి
కాసిన తియ్యని ఫలం
నిత్యం
నా కళ్లలో పరిమళపు
వానై కురుస్తూ
ఊయలలూగిస్తూనే ఉంటుంది.



**- పద్మావతి రాంభక్త**

---

## ఈ వారం కవిత్వం




**చి**నుకుల సవ్వడితో మొదలై
ఆకాశం చిల్లులు పడినట్టు
ఎడతెరిపిలేని వాన.
లోలోపల ఎగిసిన బాధలకు ఓదార్పుగా
కళ్ల నుండి రాలిన ముత్యాలు
వాన చినుకులతో కలిసి
పచ్చిక మీద ముత్యాల హారం
అల్లుతున్నాయి.
సప్త సముద్రాలు ఏకమై
అలల ప్రవాహం విజృంభించినట్టు
ఉప్పొంగిన గోదారిలా
గుండె పొంగుతోంది.
ఎప్పటికి శాంతించునో ఈ వాన
ఎప్పటికి ఒడ్డుకి చేరునో నావ.
తెగిన కట్టలు..
తడిసిన ధాన్యంగింజలు
రైతన్న ఆశలు ఆవిరై
ప్రకృతి ప్రకోపానికి గుక్కపట్టి ఏడుస్తున్నాడు.
ధైర్యం చెప్పే దారులు కరువై..
అన్నం పెట్టే చేయి
పట్టెడన్నం కోసం చాస్తూ అర్థిస్తున్నాడు.
అమ్మా.. మేఘమా
కొంచెం శాంతించు..
మనిషి చేసిన పాపాలకు
పరిహారమంటూ దూషించకు
మారని మనిషి వైఖరిని నిందించకు
నీ బిడ్డలం అనుకుని క్షమించు.
నీ కోపాన్ని ఈ బిడ్డలపై చూపించకు
చల్లని శాంతమూర్తివై కరుణించు.
మళ్లీ మా తప్పులు
పునరావృతం కానివ్వం.. కనికరించు.

**- లహరి**



## చిత్రభారతి

**వాశిరాజు ప్రకాశం**

# దాసరి నవరస భరితం 'బంగారు కుటుంబం'

ఆ రోజు వాహినీ స్టూడియోలో పండగవాతావరణం నెలకొంది. అది పండుగల సీజన్ కాదు, పెళ్లిళ్ల–పేరంటాల ముచ్చటే లేదు. అయినా అందరి కళ్లు ఆ కొత్త చిత్రం ముహూర్తం మీదనే. సినిమా పేరు 'బంగారు కుటుంబం'. ఆర్టిస్టులందరూ హేమాహేమీలే. నాగేశ్వరరావు, జయసుధ, నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ, అలుపెరగని నవ్వుల కమెడియన్ బాబుమోహన్.. అంతేనా! ఓ గొప్ప కళాఖండం సృష్టించటానికి మరో ఆకాశ నక్షత్రం కావాలి కదా! ఎవరాయన?

'బంగారు కుటుంబం' ముహూర్తం వేయి వెన్నెల కాంతులతో ఆరంభమైంది. అదే సందర్భంలో అందరూవిప్పారిన నేత్రాలతో పూల తోరణాల వైపు చూస్తుండగా దర్శకులు సింహ గాంభీర్యంతో సెట్‌లోకి అడుగు పెట్టారు. బంగారు కుటుంబానికి ఆయనే దర్శకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావు.సినిమాకు దాసరి వివిధ హోదాల్లో సేవలు అందించారు. సినిమాతల్లి ఆశీస్సులు పూలవానలా అందుకున్నారు. అయినా తీరని ఆశతో తరగని లక్ష్యంతో ఈ నవరస భరిత చిత్రం బంగారు కుటుంబంలో తనకంటూ కోయంబత్తూరు చెట్టియార్ వేషం సృష్టించుకున్నారు. ఇందులో ఆయన పాత్ర వస్త్ర వ్యాపారి. అలాంటి పాత్ర ఒకటి ఈ చిత్రంలో ఉంటుందని తతిమా ఆర్టిస్టులకు తెలియని పరిస్థితిలో దాసరి ప్రతిభా గాంభీర్యంతో అడుగులు వేశారు, అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తివేశారు.

దాసరి ఆగమనంతో ఆనందించినవారు, కొందరయితే– రెండు చేతులతో వందనాలు సమర్పించినవారు మరికొందరు కాగా– అందరి నోటా ఒకటే మాట.. "దర్శక సింహం సెట్టులోకి వచ్చాడు, మనకు యిక్కడ పని లేదు. ఈ సింహం మనల్ని దాటుకుంటూ వెళ్లిపోతాడు" అనే మాటను తెలుగు సినిమా నిజం చేసింది. "ఏమ్మా! అన్నపూర్ణ తల్లీ! ఈ ఊరు వస్తే కడుపునిండా అన్నం పెడతావు తల్లీ" అంటూ జయసుధను ఆశీర్వదించిన దాసరి మరో జ్ఞాపకాన్ని గుర్తు చేసారు. ఏమ్మా! బయటి పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం సాపాటుకు నీ యింటికే వస్తానమ్మా.. అమ్మా! మరో మరో మాట.. నేను వచ్చినప్పుడల్లా మంచి




కూర వండిపెడతారు, అదేనమ్మా మా వూళ్లో కత్తిరికాయ కూర అంటారు. అదేనమ్మా గుత్తి వంకాయ. వంకాయను నాలుగు భాగాలు చేసి, నిండా కారం ఉప్పు పెట్టమ్మా. ఎంతో సంతోషంగా వుంటుంది. నీ ప్రేమను మరిచిపోలేను అన్నపూర్ణమ్మతల్లీ" అంటూ చెట్టియారు కోయంబత్తూరు తమిళ యాసలో అడుగుతుంటే భాషలు వేరయినా మనమందరం ఒకటే. తల్లిభారతి ముద్దుబిడ్డలం. దాసరి ఆ ఒక్క వాక్యంలో యిచ్చిన సందేశంతో ఆ సినిమా నాటికీ నేటికీ నిలిచిపోయింది. రేపటికి కూడా ఆ అనురాగం, ఆప్యాయత చెక్కుచెదరదు.

కాలం అనేది ఒక ప్రవాహం. కొండలు, కోనలు, చెట్లు, చేమలు దాటుకుంటూ వచ్చినా, అందరూ సాగర గమ్యం చేరాల్సిందే. ఈ సందేశం యివ్వటానికే అన్నట్లు దాసరి ఈ కథ ఎన్నుకున్నారు. దాసరి దర్శకుడిగా ఎన్ని సినిమాలు చేసినా, తాను అందులో ఒక పాత్రను ఎన్నుకుంటే ఆ పాత్రకు శాశ్వత గుర్తింపు వుంటుందనడానికి సత్యానికి 1978లో తయారయిన 'ఆచారి' పాత్ర యిప్పటికీ సజీవంగా ఉంది.

జీవన చక్రంలో రోజులు ఎప్పుడూ ఒకేలా వుండవు. అమావాస్య, పౌర్ణమిలు కలిసే వుంటాయి. ఎవరికి ఎంత ప్రాప్తమో ఆ పరమేశ్వరునికే తెలియాలి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి గ్రామ మహిళ దాసరి పద్మ, పాలకొల్లు వరకు ఏడడుగుల బంధంతో నడిచివెళ్లి, తన జీవితాన్ని దాసరి ప్రగతికి అంకితం చేసిన వాస్తవం ఆబాలగోపాలానికి తెలిసిన సత్యం. దాసరి పద్మ చెన్నైలో చక్కని స్కూలు నడిపేవారు. ఆమె మనసు నవనీతం. ఆ యింటికి ఎవరు వెళ్లినా నిరాశతో తిరిగివచ్చిన మాట చరిత్రలో లేదు. నిర్మాతలకు, కళాకారులకు ఎంతో సహాయం చేసేవారు దాసరి పద్మ. కానీ కాలక్రమంలో జరిగిన పరిణామాలతో చరిత్రపుటలు శరవేగాన తిరిగాయి. చివరి రోజుల్లో దాసరి లెక్కల్లో ఏం తప్పులు రాసుకున్నారో ఏమో చివరకు 'ఎర్రబస్సు' 'ఫూల్స్' వంటి చిత్రాలతో ఆర్థికంగా ఎక్కిన మెట్లన్నీ దిగిపోయారు. 'రాములమ్మ'తో తెలుగు తెరమీద సంచలనం సృష్టించిన ఆయన చివరి దశలో తోడు నీడ లేకుండా ఒంటరివాడై వెళ్లిపోయారు. సినిమా పరిశ్రమకు ఆయన చేసిన సేవలు ఎలా మరిచిపో తాం.. దాసరి పద్మ, దాసరి ఇప్పుడు ఎక్కడ వున్నారో ఏమో! యిద్దరూ కలిసే వున్నారన్న కమ్మని కబురు వింటే అదే సినిమాతల్లికి వేయి నవ్వుల తోరణం. అదే అందరి ఆశ, ఆశయం. వెన్నెల జల్లుల మందహాసం! ◆

# ఈ వారం కా'ర్ట్యూన్స్'


..చలిగా ఉందా...?!
Zakir...


ఏది ముందికి చెప్పుకుని పరువు తీసుకోకండి...!
Zakir...


బిట్ కాయిన్స్ ఉన్నాయి.. తీసుకుని
ఈ పూటకు అన్నం పెట్టిస్తారా...?!
Zakir...



ఫోటో ఫీచర్





ప్రపంచంలోనే అతి సన్నటి నగరంగా పేరు గాంచింది 'యాంజిన్'. ఇది చైనాలో ఉంది. ఇక్కడ పర్వతాల మధ్య చాలా తక్కువ దూరం ఉంటుంది. ఎటు చూసినా ఎత్తయిన పర్వతాలు, పర్వతాల మధ్య గల గలా పారే నది, నది ఒడ్డునానుకునే వుండే కట్టడాలు ఈ నగర ప్రత్యేకతలు.



